www.prajavinikidi.com
RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

సంపుటి - 4 సంచిక -132 బుధవారం 26 ఆగస్టు 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు 8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

విలేకరులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా వినికిడి
తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
8978701613,7013016545

## సెప్టెంబర్ 7 నుంచి తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు..

ఎన్నికల వయసు తగ్గింపుపై కీలక తీర్మానం!

ఎన్నికల్లో పోటీ వయసు 21 ఏళ్లకు తగ్గించాలని తీర్మానం చేసే అవకాశం

తీర్మానాన్ని కేంద్ర ప్రభుత్వానికి పంపనున్న రేవంత్ ప్రభుత్వం

నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి పెట్టాలని శాసనసభ్యులకు సూచన



**హైదరాబాద్ ఆగస్టు(ప్రజావినికిడి):** తెలంగాణ శాసనసభ సమావేశాలు సెప్టెంబర్ 7వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. సచివాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో మిగతా2లో...

## మూసీ ప్రాజెక్టు కోసం భూసేకరణ వేగవంతం చేయండి

ల్యాండ్ పూలింగ్ పై స్పష్టమైన విధానం రూపొందించండి

సమీక్షా సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్ ఆగస్టు (ప్రజావినికిడి):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మూసీ ప్రాజెక్టు కోసం భూసేకరణను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించారు. ల్యాండ్ పూలింగ్ పై స్పష్టమైన విధానాన్ని రూపొందించాలని ఆయన వారికి సూచించారు. మంగళవారం హైదరాబాద్ లోని ఎంసీఆర్ హెచ్ఆర్డీలో మూసీ ప్రాజెక్టు, ఆ నది ప్రక్షాళనపై సీఎం ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎఫ్టీఎల్, బఫర్ జోన్, అసైన్డ్ భూముల సేకరణ తదితర అంశాలపై స్పష్టమైన విధానాన్ని రూపొందించి సమర్పించాలంటూ ఆదేశించారు. ఇదే సమయంలో న్యాయపరమైన చిక్కులు రాకుండా చూసుకోవాలని దిశా నిర్దేశం చేశారు. మూసీ ప్రాజెక్టు ఫేజ్ 2కు వీలైనంత త్వరగా టెండర్లు పిలవాలని కోరారు. మిగతా2లో...





## ఏడాదిలో దేవాదుల ప్రాజెక్టు పూర్తి చేయడమే లక్ష్యం

- స్పష్టమైన కార్యాచరణతో పనులు వేగవంతం చేయాలి
- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

**హైదరాబాద్,ఆగస్టు (ప్రజావినికిడి):** దేవాదుల ప్రాజెక్టును ఏడాదిలోగా వందశాతం పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అధ్యక్షతన మంగళవారం నాడు జలసౌధలో దేవాదుల ప్రాజెక్టు పై జరిగిన మిగతా2లో...

## తెలుగు రాష్ట్రాల మధ్య రహదారి అభివృద్ధి

రూ.840.41 కోట్లతో విస్తరణకు కేంద్రం ఆమోదం

కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ వెల్లడి



2లో

## వనమహోత్సవ లక్ష్యాన్ని చేరుకోవాలి

- నాటిన ప్రతి మొక్కను రక్షించుకోవాలి
- ప్రతి ఒక్కరికి పని కల్పించి ఆదుకోవాలి
- అధికారులను ఆదేశించిన మంత్రి సీతక్క



2లో

## సీజనల్ వ్యాధులపై దృష్టి పెట్టండి



2లో

● వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి ● ఎల్‌నినో ప్రభావంతో పంటల మార్పిడి జరగాలి ● నీట్ పరీక్ష పక్కాగా జరిగేలా చర్యలు ● కలెక్టర్లకకు సిఎస్ సంజయ్ జాజు దిశానిర్దేశం

## విద్యార్థుల జీవితాలతో ఆటలొద్దు

- ఫీజు బకాయిలు వెంటనే చెల్లించాలి
- సిఎం రేవంత్‌కు బాధ్యతారాహిత్యం కూడదు
- బిజెపి సభలో ఎంపి ఈటలె రాజేందర్ విమర్శలు
- స్వల్పంగా దెబ్బతిన్న రామచంద్ర రావు ఆరోగ్యం



**హైదరాబాద్,ఆగస్టు (ప్రజావినికిడి):** 20 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడొద్దని అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి అంటే అర్థం ఏంటో తెలుసా అని ప్రశ్నించారు. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల గురించి ఆలోచించాల్సిన బాధ్యత ముఖ్యమంత్రిదేనని రేవంత్ రెడ్డిని ఉద్దేశించి అన్నారు. 'ఫీజు బకాయి – భాజపా లడాయి' పేరుతో మిగతా2లో...

## సిఎం రేవంత్ యూఎస్ పర్యటనపై వివరణ ఇవ్వాలి

ఎందుకు అమెరికా పర్యటనో వివరంగా చెప్పాలి

మేయర్ మమ్దానీని ఎందుకు కలవాలనుకున్నారో చెప్పాలి

నిబంధనల మేరకే కేంద్ర విదేశాంగశాఖ నిర్ణయాలు

కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పష్టీకరణ



**న్యూఢిల్లీ,ఆగస్టు (ప్రజావినికిడి):** అమెరికా పర్యటనపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్లారిటీ ఇవ్వాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. రాజకీయ కారణాలతోనే తన యూఎస్ పర్యటనను కేంద్రం అడ్డుకుందంటూ సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను కిషన్ రెడ్డి తోసిపుచ్చారు. ఈ నేపథ్యంలో మం గళవారం ఢిల్లీలో ఆయన స్పందించారు. సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు అర్ధరహితం అని కొట్టిపారేశారు.

మిగతా2లో...



## 22ఎ భూములపై సిట్టింగ్ జడ్జితో విచారణ

పొంగులేటిని వెంటనే బర్తర్ఫ్ చేయాలి

అసెంబ్లీలో ఈ అంశంపై సర్కార్‌ను నిలదీస్తాం

బిఆర్ఎస్ నేత హరీశ్ రావు డిమాండ్

**హైదరాబాద్,ఆగస్టు (ప్రజావినికిడి):** మొత్తం 22ఎ నిషేధిత భూముల అక్రమాలపై తక్షణమే హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, అసలు ఈ భూములను ఎవరు నిషేధిత జాబితాలో పెట్టమన్నారో నిజాలు బయటపడాలని బిఆర్ఎస్ నేత హరీశ్ రావు డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే ఈ వ్యవహారంపై శ్వేతపత్రం విడుదల చేయాలని, నిషేధిత జాబితాను వెబ్‌సైట్‌లో

మిగతా2లో...

## వారిపై చర్యలు ఉంటాయి: మల్లు రవి



**హైదరాబాద్ ఆగస్టు (ప్రజావినికిడి):** మంత్రి కొండా సురేఖ, చిన్నారెడ్డిపై పూర్తి అంశాలతో నివేదికను పొందు పరిచి టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌కు అందజేశామని క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి స్పష్టం చేశారు. దీనిని పార్టీ రాష్ట్ర వ్యవహారాల

మిగతా2లో...

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# సెప్టెంబర్ 7 నుంచి తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు..

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ విషయాన్ని శాసనసభ్యులకు వెల్లడించారు. అయితే, ఈ సమావేశాలు ఎన్ని రోజుల పాటు కొనసాగుతాయి, సభా అజెండా ఏమిటన్న అంశాలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.

ఈ సమావేశాల్లో ప్రభుత్వం ఒక కీలక తీర్మానాన్ని ఆమోదించే అవకాశం ఉంది. లోక్‌సభ, శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల కనీస వయసును 25 ఏళ్ల నుంచి 21 ఏళ్లకు తగ్గించాలని కోరుతూ సభలో తీర్మానం చేయనున్నారు. అనంతరం దీనిని కేంద్ర ప్రభుత్వానికి పంపి, పార్లమెంటులో సంబంధిత బిల్లును ప్రవేశపెట్టాలని కోరనున్నారు. చట్టసభల్లో యువతకు మరింత ప్రాతినిధ్యం కల్పించాలనే ఉద్దేశంతోనే ఈ మార్పును ప్రతిపాదిస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతంలోనే పేర్కొన్నారు.

నియోజకవర్గాల అభివృద్ధి పనులపై కూడా ముఖ్యమంత్రి ఈ సమావేశంలో సమీక్ష జరిపారు. పెండింగులో ఉన్న సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని ఆయన ఎమ్మెల్యేలను ఆదేశించారు. భూసేకరణలో జాప్యం జరిగితే ప్రాజెక్టుల నిర్మాణం నిలిచిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. భూసేకరణ, పునరావాసం, అటవీ శాఖ అనుమతులకు అవసరమైన నిధులను ప్రభుత్వం మంజూరు చేస్తుందని ఆయన హామీ ఇచ్చారు. ప్రతి ఎమ్మెల్యే తమ నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.
పరిస్థితి రాకుండా చూడాల్సిన బాధ్యత కమిటీ ఛైర్మన్ మరియు సభ్యులపైన ఉన్నదన్నారు. గిరిజనులు, వెనుకబడిన తరగతులు, మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కమిటీలు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.
సంక్షేమ పథకాల అమలులో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ పరిష్కార మార్గాలను సూచించాలి. కమిటీల సభ్యులు ప్రజల నుంచి వచ్చే సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి, వాటి పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ... లెజిస్లేటివ్ కమిటీలు ప్రభుత్వం మరియు ప్రజల మధ్య ఒక ముఖ్యమైన వారధిగా పని చేయాలన్నారు. తద్వారా పథకాల అమలులో ప్రభుత్వం మెరుగైన ఫలితాలు సాధించేందుకు మరియు ప్రజలకు పథకాలు మరింతగా చేరువయ్యేందుకు ఉపయోగపడుతుంది. తెలంగాణ రాష్ట్ర జనాభాలో 10.45 శాతం మంది ఉన్న షెడ్యూల్డ్ తెగల జీవన పరిస్థితులను అధ్యయనం చేయడం, వారి సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల అమలు తీరును సమీక్షించడం, లోటుపాట్లను గుర్తించడం, వారి సమగ్ర అభివృద్ధికి అవసరమైన సూచనలను ప్రభుత్వానికి అందించడం ఈ షెడ్యూల్ తెగల సంక్షేమ కమిటీ ప్రధాన కర్తవ్యం అన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం మరియు సమ్మిళిత అభివృద్ధి అనే ఆదర్శాల పట్ల మనందరి సమిష్టి నిబద్ధతకు వెనుకబడిన తరగతుల సంక్షేమ కమిటి ప్రతీక. కమిటీలు ప్రజల అవసరాలను అర్థం చేసుకుని, అర్థవంతమైన సిఫార్సుల ద్వారా వారి జీవన నాణ్యతను మెరుగుపరచడానికి దోహదపడాలి.
మహిళల భద్రత మరియు ఆర్థిక సాధికారతకు సంబంధించిన పథకాలు, శిశు సంక్షేమ సంస్థలు మరియు అంగన్వాడీల పనితీరు, దివ్యాంగులకు అందుబాటులో ఉన్న సౌకర్యాలు, అలాగే వయోవృద్ధులకు అందుబాటులో ఉన్న జీవన పరిస్థితులు మరియు ఆరోగ్య సంరక్షణ వంటి అంశాలపై కమిటీ ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. శాసన వ్యవహారాల శాఖా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... శాసనమండలి సంయుక్త కమిటీలు అత్యంత ప్రభావితమైనవి. బలహీన వర్గాల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను మరింత సమర్ధవంతంగా అమలు చేయడానికి ఈ సంయుక్త కమిటీ సూచనలు, సలహాలు ఉపయోగపడుతాయి. క్షేత్ర స్థాయిలోని సమస్యలను గుర్తించి వాటికి పరిష్కారాలతో ప్రభుత్వం దృష్టికి తీసుకురావడం ద్వారా పరిష్కరించవచ్చు.

# తెలుగు రాష్ట్రాల మధ్య రహదారి అభివృద్ధి

**న్యూఢిల్లీ,ఆగస్టు (ప్రజావినికిడి)::** తెలుగు రాష్ట్రాలను కలిపే జాతీయ రహదారి 365బీబీ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బుట్టాయగూడెం-ఎల్ఎన్‌డీ పేట, పట్టిసీమ-కొవ్వూరు సెక్షన్ల మధ్య 45.09 కిలోమీటర్లతో రహదారి ఉన్నతీకరణ కోసం రూ.840.41 కోట్లతో కేంద్రం ఆమోదం తెలిపింది. ఈ మేరకు కేంద్ర రోడ్లు, రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఎక్స్ వేదికగా వెల్లడించారు. 45 కిలోమీటర్ల 2 లేన్ల జాతీయ రహదారికి ఇరువైపులా రోడ్లు నిర్మించనున్నట్లు గడ్కర్ తెలిపారు. ఈ రహదారి ఉన్నతీకరణతో పోలవరం ప్రాజెక్ట్, పరిసర గ్రామాలకు కనెక్టివిటీ పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ ప్రాంతం పొగాకు, చెరకు, ఫామాయిల్ తోటలతో నిండి ఉంటుందని.. ఈ హైవే అభివృద్ధితో మౌలిక సదుపాయాలు మెరుగు అవుతాయన్నారు. పంటల రవాణా వేగంగా, సురక్షితంగా జరుగుతుందని చెప్పారు. పంట పొలాల నుంచి మార్కెట్‌కు అనుసంధానం పెరుగుతుందని, స్థానికంగా జీవనోపాధి మెరుగవుతుందని గడ్కరీ పేర్కొన్నారు. అప్‌గ్రేడ్ చేసిన జాతీయ రహదారితో తెలుగు రాష్ట్రాల మధ్య కనెక్టివిటీ పెరగడంతో పాటు, ఇరురాష్ట్రాల ప్రయాణికులకు, పర్యాటకులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల నేపథ్యంలో భక్తులు సులభంగా ఘాట్ల వద్దకు చేరుకోవడానికి, పోలవరం ప్రాజెక్ట్ సందర్శించేందుకు వీలవుతుందన్నారు.

# వారిపై చర్యలు ఉంటాయి: మల్లు రవి

(మొదటి పేజీ తరువాయి)

ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌కు పంపారని తెలిపారు. మంగళవారం హైదరాబాద్ గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ..గత విషయాలను కూడా పరిగణలోకి తీసుకున్నామని వివరించారు. ఈ నివేదికను ఏఐసీసీ చీఫ్, పార్టీ జనరల్ సెక్రటరీకి కూడా పంపిస్తారని అన్నారు. కాంగ్రెస్ హై కమాండ్ ఆదేశాల మేరకు వారిపై చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.నాయకులు, క్యాడర్‌కు ఒక మెసేజ్ ఇవ్వాలని అనుకుంటున్నామని మల్లు రవి తెలిపారు. పార్టీపై నెగెటివ్ అభిప్రాయాన్ని కలిగించకుండా ఉండాలంటే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాల్సిందని అభిప్రాయపడ్డారు.

# మూసీ ప్రాజెక్టు కోసం భూసేకరణ వేగవంతం చేయండి

(మొదటి పేజీ తరువాయి)

ప్రాజెక్టుల నిర్మాణానికి అతి తక్కువ వడ్డీకి రుణాలిచ్చే సంస్థలపై మున్సిపల్ కమిషనర్లు దృష్టి సారించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. టీడీఆర్ పై ప్రతి వారం సమీక్ష నిర్వహించాలన్నారు. మంచిరేవుల ఓంకారేశ్వర స్వామి ఆలయ టెండర్లను తక్షణమే పిలవాలంటూ సూచించారు. కొత్వాల్ గూడలోని బర్డ్స్ పార్కుకు మరింత ప్రచారం కల్పించాలని సీఎం ఆదేశించారు. సమీక్షలో సీఎం కార్యదర్శి మాణిక్ రాజ్, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫ్ రాజ్ అహ్మద్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ తదితరులు పాల్గొన్నారు.
ప్రవక్త బోధించిన జీవన విధానం ఆదర్శప్రాయం
మిలాద్ ఉన్ నబీ పండుగ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ముస్లీం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. మహమ్మద్ ప్రవక్త బోధించిన శాంతి, ప్రేమ, సోదరభావం, కరుణ, మానవత్వం, క్రమబద్ధమైన జీవన విధానం నేటి సమాజానికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. ఆయన సందేశాలు ప్రపంచ శాంతి, సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయన్నారు.

# ఏడాదిలో దేవాదుల ప్రాజెక్టు పూర్తి చేయడమే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

సమీక్షలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ప్రాజెక్టు పనులను ప్రారంభం నుంచి ముగింపు వరకు సమగ్రంగా సమీక్షించి, ఎక్కడ పనులు నిలిచిపోయాయి, అందుకు కారణాలేంటి.. వాటిని పరిష్కరించేందుకు తీసుకోవాల్సిన చర్యలేంటి అనే అంశాలను పాయింట్‌వారీగా గుర్తించాలని అధికారులను ఆదేశించారు. సమస్యను గుర్తించకుండా పనులు పూర్తవుతాయి అంటూ కాలయాపన చేయడం సరికాదని, ప్రతి సమస్యకు స్పష్టమైన పరిష్కారం, బాధ్యత, గడువు నిర్ణయించాలని అధికారులకు సూచించారు. భూసేకరణ, అనుమతులు, నిర్మాణ పనులు, నిధులు, కాంట్రాక్టు ఏజెన్సీలకు సంబంధించిన సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం, అధికారులు, ఇంజినీర్లు, ఏజెన్సీలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ప్రాజెక్టుపై పూర్తి అవగాహన ఉన్న అధికారులతో స్టార్టింగ్ నుంచి ఎండింగ్ వరకు సమగ్ర సమీక్ష నిర్వహించి, స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. సమస్య ఎక్కడ ఉందో ముందుగా గుర్తించాలి.. కారణాన్ని విశ్లేషించాలి.. పరిష్కారాన్ని ఖరారు చేసి అమలు చేయాలి. ఫలితం వచ్చే వరకు నిరంతరం పర్యవేక్షించాలి. దేవాదుల పూర్తి విషయంలో ఎలాంటి కాలయాపనకు తావులేదుఅని మంత్రి స్పష్టం చేశారు.

# వనమహోత్సవ లక్ష్యాన్ని చేరుకోవాలి



**హైదరాబాద్,ఆగస్టు (ప్రజావినికిడి)::** రాష్ట్ర వ్యాప్తంగా వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలని మంత్రి సీతక్క సంబంధిత అధికారులను ఆదేశించారు. మొక్కలు నాటిన విధంగానే.. నాటిన మొక్కల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని మంత్రి సీతక్క ఆదేశించారు. ప్రతి మొక్కను సంరక్షిస్తూ వందశాతం మనుగడ సాధించాలని చెప్పారు. నాటిన మొక్కలకు క్రమం తప్పకుండా నీటిని అందించాలని సూచించారు. వన మహోత్సవం లక్ష్యాలను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో గ్రామీణ అభివృద్ధి శాఖపై మంత్రి సీతక్క వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో కమిషనర్ దివ్య, స్పెషల్ కమిషనర్ శ్రీలక్ష్మి, జిల్లా సీఈవోలు, డీఆర్డీవోలు, డీపీవో, అడిషనల్ డీఆర్డీవోలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై మంత్రి సీతక్క దిశానిర్దేశంచేశారు. ఉపాధి హామీ పనులు, పంట కుంటల నిర్మాణం, మహిళా సంఘ భవనాల నిర్మాణం, నూతన చేయూత పెన్షన్ల మంజూరుపై సమీక్షించారు. ఇప్పటివరకు 86శాతం మొక్కలు నాటామని తెలిపారు. 6.18 కోట్ల మొక్కలు నాటి లక్ష్యాన్ని నిర్దేశిరచుకుని 5.32 కోట్ల మొక్కలను నాటినట్లు వెల్లడించారు. ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాలు, విద్యార్థులు, యువతను భాగస్వాములను చేయాలని దిశానిర్దేశర చేశారు. మొక్కలకు రక్షణ కంచెలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని తెలిపారు. అవెన్యూ ప్లాంటేషన్లలో ఫెన్సింగ్ పటిష్ఠంగా ఉండేలా చూడాలని అన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో రోజుకు కనీసం 60 మంది కూలీలకు ఉపాధి కల్పించాలని తెలిపారు. పనికి సిద్ధంగా ఉన్న ప్రతి కూలీకి పని అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సీతక్క ఆదేశించారు. కూలీలకు వారి నివాస ప్రాంతానికి సమీపంలోనే ఉపాధి కల్పించాలని అన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో తగినంత పనుల షెల్ఫ్ సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ఔఓఓ÷ూ హాజరును ప్రతిరోజూ పర్యవేక్షించాలని మార్గనిర్దేశర చేశారు. కూలీల సమీకరణ బాధ్యతను క్షేత్రస్థాయి సిబ్బందికి స్పష్టంగా అప్పగించాలని నిర్దేశిరచారు. మంజూరైన అన్ని ఫార్మ్ పాండ్ల పనులను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. ఉపాధితో పాటు నీటి సంరక్షణకు శాశ్వత ఆస్తులుగా అభివృద్ధి చేయాలని మంత్రి సీతక్క సూచించారు. తక్కువ పనితీరు ఉన్న జిల్లాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. స్పష్టమైన లక్ష్యాలు నిర్దేశిరచి నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. ఉపాధి పనులతో పాటు నీటి సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. ఆదివాసి గిరిజన ఏజెన్సీ ప్రాంతాల్లో చెక్ డ్యాముల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని నిర్దేశిరచారు. ఫార్మ్ పాండ్లు, ఇతర నీటి సంరక్షణ పనులను వేగంగా ప్రారంభించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి, నీటి సంరక్షణ, జీవనోపాధి ఆస్తుల సృష్టి ఏకకాలంలో జరగాలని చెప్పారు. ప్రభుత్వ లక్ష్యాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని మంత్రి సీతక్క ఆదేశించారు.

# 22ఎ భూములపై సిట్టింగ్ జడ్జితో విచారణ

(మొదటి పేజీ తరువాయి)

ఎందుకు బ్లాక్ చేశారో సమాధానం చెప్పాలని అన్నారు. ప్రజల భూములతో చెలగాటమాడుతున్న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని ముఖ్యమంత్రి తక్షణమే బర్తరఫ్ చేయాలని కోరారు. బాధితుల పక్షాన నిలబడి సెప్టెంబర్ 7న ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ఒత్తిడి తెస్తామని, సభను స్తంభింపజేసి అయినా బాధితులకు న్యాయం జరిగేలా పోరాడతామని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన తమ్ముడికి మాత్రం వందల కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూములను కట్టబెడతారని, సామాన్య ప్రజల ఆస్తులను మాత్రం 22ఎలో పెట్టి ఇబ్బందుల పాలు చేస్తారని హరీశ్ రావు విమర్శించారు. చివరికి అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్, సీఎం ఇల్లు కూడా 22ఎ నిషేధిత జాబితాలోనే ఉన్నాయంటే ఈ ప్రభుత్వ పనితీరు ఎంత అధ్వాన్నంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు.

రాష్ట్రంలో ఎక్కడ ప్రభుత్వ భూములున్నా హెచ్ఎండీఏ, టీజీఐఐసీ, హౌసింగ్ బోర్డు భూములతో పాటు పిల్లలు ఆడుకునే వెయ్యి గజాల పార్కును కూడా రేవంత్ రెడ్డి అమ్మకానికి పెట్టారని, ఇలా అమ్ముకుంటూ పోతే రేపు బడికి, గుడికి, చివరకు స్మశాన వాటికకు కూడా భూమి మిగలదని ధ్వజమెత్తారు. కమీషన్ల కక్కుర్తి కోసమే సామాన్య ప్రజల ఆస్తులను ప్రభుత్వం నిషేధిత జాబితాలోకి నెట్టిందని బీఆర్ఎస్ డిప్యూటీ ఎలోర్ లీడర్, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం షాపూర్ నగర్ ఎం.జే. గార్డెన్స్‌లో 22ఎ భూముల సమస్యలతో సతమతమవుతున్న బాధిత కుటుంబాల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. స్థానిక ఎమ్మెల్యే కేపీ వివేకానంద, ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, గోరేటి వెంకన్న తదితరులతో కలిసి బాధితుల ఆవేదనను స్వయంగా అడిగి తెలుసుకున్న హరీశ్ రావు, బీఆర్ఎస్ పార్టీ పక్షాన వారికి పూర్తి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై పదునైన విమర్శలు గుప్పించారు. 22ం కుట్ర వెనుక భారీ కమీషన్ల బాగోతం దాగి ఉందన్న ఆయన, ఈ అక్రమాల్లో ఏ-1గా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏ-2గా రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఉన్నారని ఆరోపించారు. 50-50 కమీషన్ల కోసమే లక్షలాది మంది ప్రజలను నిద్రలేకుండా చేస్తున్నారని మండిపడ్డారు. 98 శాతం భూములను 22ం జాబితా నుంచి తొలగించామని మంత్రి పొంగులేటి పచ్చి అబద్దాలు ఆడుతున్నారని, అదే నిజమైతే వందలాది మంది బాధితులు తమ గోడు వెళ్లబోసుకోవడానికి ఇక్కడికి ఎందుకు వస్తారని ప్రశ్నించారు.

# సీజనల్ వ్యాధులపై దృష్టి పెట్టండి

**హైదరాబాద్,ఆగస్టు (ప్రజావినికిడి):** సీజనల్ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలనిఅధికారులకు సీఎస్ సంజయ్ జాజు సూచించారు. వర్షాలు, వరదలు నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని స్పష్టం చేశారు. అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంటనే స్పందించేలా జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టర్లతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సీజనల్ పరిస్థితులు, ప్రజలకు అవసరమైన సేవలు, నీట్ పీజీ ప్రవేశ పరీక్ష ఏర్పాటు తదితర అంశాలపై కలెక్టర్లతో ఆయన సమీక్షించారు. ఆయా అంశాలపై చేపడుతున్న చర్యలను కలెక్టర్లను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఇక నీట్ పీజీ ప్రవేశ పరీక్ష నిర్వహణకు సంబంధించి జిల్లాల్లో చేపట్టాల్సిన ఏర్పాట్లపై సీఎస్ ప్రత్యేకంగా సమీక్షించారు. పరీక్షా కేంద్రాల వద్ద మౌలిక వసతులు, భద్రత, విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్యం, రవాణా తదితరత అంశాలపై అధికారులతో సమన్వయం చేసుకుని పని చేయాలని సూచించారు. ఈ ప్రవేశపరీక్షను ప్రశాంతంగా నిర్వహించేందుకు ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్లను సీఎస్ సంజయ్ జాజు ఆదేశించారు. ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో పంట మార్పిడి విధానాలపై రైతులను మరింత చైతన్యపరిచి వ్యవసాయసాగుకు అనుసరించాల్సిన నూతన విధానాలపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. జిల్లాల వారీగా సీజనల్ పరిస్థితులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తీసుకుంటున్న ముందస్తు చర్యలపై సీఎస్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. వాతావరణ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన చోట తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్లను ఆదేశించారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రూపొందించిన ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేసేందుకు తగిన చర్యలు చేపట్టాలన్నారు. పంటల వైవిధ్యీకరణ (క్రాప్ డైవర్సిఫికేషన్) అవసరాన్ని చెబుతూ, తక్కువ నీటి అవసరం ఉండే, ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుకూలమైన పంటలను సాగు చేసేలా రైతులకు నిరంతరం అవగాహన కల్పించాలని సూచించారు.

# విద్యార్థుల జీవితాలతో ఆటలొద్దు

(మొదటి పేజీ తరువాయి)

భాజపా చేపట్టిన కార్యక్రమంలో ఈటల పాల్గొని మాట్లాడారు. సీఎం ఒకసారి రాష్ట్రంలోని విద్యార్థుల పరిస్థితి గురించి ఆలోచించాలన్నారు. 20లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును కాపాడే బాధ్యతను భాజపా తీసుకుందని పేర్కొన్నారు. 'నా విద్యార్థులు, నా యువత క్వాలిటీగా ఉండాలి.. ఆరోగ్యవంతులుగా ఉండాలి' అని కలలు కంటున్న నాయకుడు నరేంద్ర మోదీ అని వివరించారు.

పేద తల్లిదండ్రుల పిల్లలు కూడా గొప్పగా చదువుకొని డాక్టర్లు, ఇంజనీర్లు, అడ్వకేట్లు, ఉన్నతాధికారులు కావాలని కలలు కంటున్నారని, అదే నిజమైన తెలంగాణ అభివృద్ధిగా పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం రామచందర్ రావు చేస్తున్న ఈ 48 గంటల దీక్షకు బీజేపీ అండగా ఉందన్నారు.

ఫీజుల బకాయిలు చెల్లించే వరకు.. తెలంగాణ విద్యార్థులకు న్యాయం జరిగే వరకు భాజపా పోరాటం కొనసాగుతుందని తెలిపారు. నిరాహార దీక్ష చేస్తున్న భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు అస్వస్థతకు గురయ్యారు. రామచందర్ రావును పరీక్షించిన వైద్యులు.. బీపీ 90/60గా ఉన్నట్లు తెలిపారు.'ఫీజు బకాయి-భాజపా లడాయి' పేరుతో భాజపా నేతలు రెండో రోజు నిరాహార దీక్ష కొనసాగిస్తున్నారు. రామచందర్ రావు దీక్షకు మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు కాటిపల్లి వెంకట రమణారెడ్డి, పాయల్ శంకర్, రామారావు పటేల్ పలువురు భాజపా నేతలు మద్దతు తెలిపారు.

# సీఎం రేవంత్ యూఎస్ పర్యటనపై వివరణ ఇవ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

అనుమతులు లేకుండా ఎందుకు విదేశీ పర్యటనకు వెళ్లారంటూ తెలంగాణ సీఎంను ఆయన సూటిగా ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి.. స్థాయికి తగినట్లుగా ఈ పర్యటన లేదని తెలిపారు.ముఖ్యమంత్రుల విదేశీ పర్యటనపై తాము కొత్తగా నిబంధనలు పెట్టలేదని గుర్తు చేశారు. స్వాతంత్య్రం నుంచి ఉన్న నిబంధనలే తాము అమలు చేశామని స్పష్టం చేశారు.

ఇది సాధారణ ప్రక్రియ.. ఇందులో రాజకీయాలకు తావు లేదన్నారు. భారత్‌పై విషం చిమ్మే వ్యక్తి న్యూయార్క్ మేయర్ మామ్దానీతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ కానున్నారంటూ వార్తలు వచ్చాయని వివరించారు. ప్రధాని మోదీని టెర్రరిస్ట్ అని న్యూయార్క్ మేయర్ వ్యాఖ్యనించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు.
మామ్దానీను ఎందుకు కలుస్తున్నారో.. సీఎం రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.గతంలో తన విదేశీ పర్యటనను కూడా కేంద్ర విదేశాంగ శాఖ నిరాకరించిందని కిషన్ రెడ్డి తెలిపారు. మన దేశ ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకొని విదేశాంగ శాఖ ఈ నిర్ణయం తీసుకుందని అభిప్రాయపడ్డారు.

గుజరాత్ సీఎంకు యూఎస్ పర్యటనకు అనుమతి ఇచ్చి.. తమకు అనుమతి ఇవ్వలేదని సీఎం రేవంత్ వాదించడం వితండవాదమని పేర్కొన్నారు. నరేంద్ర మోదీ సీఎంగా ఉన్నప్పుడు నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆయన విదేశీ పర్యటనను నిరాకరించిందని చెప్పారు. అయితే సీఎం రేవంత్ రెడ్డికి హార్వర్డ్ బిజినెస్ కోర్సు చదివేందుకు కేంద్రం అనుమతి ఇచ్చిందన్నారు. కాంగ్రెస్ ముఖ్యమంత్రుల విదేశీ పర్యటనలను కూడా గతంలో రద్దు చేసిందని చెప్పారు.
కుల గణన అంశంలో తెలంగాణ ప్రభుత్వం ఫెయిల్యూర్ అయిందని తెలిపారు. హైదరాబాద్‌లో 20 శాతం ఇళ్లలో కులగణన జరగలేదని వివరించారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీకి కుల గణనపై అవగాహన లేదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఎద్దేవా చేశారు.

# పర్యావరణ హితంగా వేడుకలు జరగాలి

### గణేష్ ఉత్సవాలతోనే ప్రారంభమవ్వాలన్న హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్





**కొత్తపేట,(ప్రజావినికిడి):** వేడుక ఏదైనా పర్యావరణ హితంగా ఉండాలి. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతగా మారాలి.గణేష్ ఉత్సవాలతోనే ఇది ప్రారంభం కావాలి.. స్వాతంత్ర సంగామానికే గణేష్ ఉత్సవం ఊతమిచ్చింది. ఇప్పుడు పర్యావరణ పరిరక్షణకు కూడా తోడ్పడాలి. నగరంలో చెరువులన్నీ కాలుష్య రహితంగా మారాలి. ఆక్రమణలను తొలగించి చెరువులను హైడ్రా విస్తరిస్తోంది. మురికి కూపాలుగా ఉన్న చెరువులలో పూడికను మొత్తం తొలగించి మంచి నీటి సరస్సులుగా మార్చేందుకు హైడ్రా గట్టి ప్రయత్నం చేస్తోంది. మురుగు నీరు కలవకుండా ప్రతి చెరువు వద్ద ఎస్టీపీ(సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్)లను కూడా ఏర్పాటు చేస్తోంది.ఈ క్రమంలో చెరువులు కాలుష్యం కాకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది.గణేష్ ఉత్సవాలను దృష్టిలో పెట్టుకునే ప్రతి చెరువు వద్ద బేబీ పాండ్లను నిర్మిస్తున్నాం. ఇలాంటి తరుణంలో నగర ప్రజలు కూడా పర్యావరణ హితమైన గణేష్ విగ్రహాలకే ప్రాధాన్యం ఇవ్వాలి..అని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ విజ్ఞప్తి చేశారు.ఈ దిశగా ఇప్పటికే చాలా మార్పు వచ్చి ఇళ్లల్లో పెట్టే చిన్న విగ్రహాలను మట్టితో రూపొందిస్తున్నారు.ఉత్సవ ఊరేగింపునకు అనుగుణంగా పెద్ద విగ్రహాలు కూడా మట్టితో తయారయ్యేలా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందుకు సాంకేతికను అంది పుచ్చుకోవాలని.. ఆ దిశగా నిపుణులు ఆలోచించాలని కోరారు.ఈ విషయంలో స్వచ్ఛంద సంస్థలతో కలసి పని చేసేందుకు హైడ్రా సిద్ధంగా ఉందన్నారు. పర్యావరణ హితమైన నగర నిర్మాణంలో ప్రభుత్వం చూపుతున్న చొరవే హైడ్రా ఏర్పాటని..ఆ క్రమంలోనే మట్టి విగ్రహాలపై కూడా అందరూ దృష్టి సారించాలని నగరంలోని పలు స్వచ్ఛంద సంస్థలు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ని కలిసి విజ్ఞప్తి చేశాయి.ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో కలిగే నష్టాలను.. మట్టి విగ్రహాలతో కలిగే లాభాలను వివరిస్తూ రూపొందించిన పోస్టర్‌ను హైడ్రా కమిషనర్ చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు.ఒక్క రూపాయికే మట్టి విగ్రహాలను అందిస్తున్నామని ఈ సందర్భంగా లైఫ్ సేవర్స్ ఆర్గనైజేషన్ ప్రతినిధి శివ నేత తెలిపారు.హైడ్రా అభివృద్ధి చేస్తున్న చెరువులు ఎంతో పర్యావరణ హితంగా మారుతున్నాయని..వాటికి మన ఉత్సవాలు కూడా తోడవ్వాలని.. అందరూ మట్టి విగ్రహాలకు జై కొట్టాలని సురక్ష సేవా సంఘం ప్రతినిధి గోపి శంకర్ అలాగే స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు విజయభాస్కర్, విష్ణు,లలిత్ కుమార్ నేత, శ్రీనివాస్,అశోక్, సుధీర్,ప్రవీణ్ మొదలగువారు అభిప్రాయపడ్డారు.

# విద్యార్థులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

### విద్యావ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్న రేవంత్ రెడ్డి నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి



**షాద్ నగర్,(ప్రజావినికిడి):** ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచందర్ రావు ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు రోజుల దీక్షలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు.రాష్ట్రంలో సుమారు రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. బకాయిలు చెల్లించకపోవడంతో పేద,బడుగు బలహీన వర్గాల విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతోందని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులు ఆలస్యం కావడంతో తెలంగాణలోని అనేక ప్రైవేట్ కళాశాలలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులుఎదుర్కొంటున్నాయని అన్నారు. కళాశాలల్లో పనిచేస్తున్న వేలాది మంది అధ్యాపకులు, లెక్చరర్లకు సకాలంలో జీతాలు అందక ఆవేదన చెందుతున్నారని తెలిపారు.విద్యాసంస్థలను నడుపుతున్న యాజమాన్యాలు కూడా ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిల కోసం ఎదురుచూస్తున్నాయని, ప్రభుత్వం తక్షణమే స్పందించి కళాశాలలు,విద్యార్థులు, అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలను కూడా ప్రభుత్వం పరిష్కరించాలి.పీఆర్సీ,డీఏలు, రిటైర్డ్ ఉద్యోగులకు అందాల్సిన పీఎఫ్,గ్రాట్యుటీ తదితర ప్రయోజనాల విషయంలో జాప్యం జరుగుతోందని నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి ఆరోపించారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యాశాఖను కూడా నిర్వహిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర విద్యా వ్యవస్థపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా విధానం-2020 (ఎన్ ఈ పి 2020)ను సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా విద్యా వ్యవస్థలో నాణ్యతను పెంచవచ్చని అన్నారు.మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతోంది.ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడం వల్ల విద్యార్థులు,కళాశాలలు, అధ్యాపకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.వెంటనే రూ.15 వేల కోట్ల బకాయిలను విడుదల చేయాలి అని నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు.విద్యార్థులు,విద్యాసంస్థలు, అధ్యాపకులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోకపోతే బీజేపీ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.

# చించోడు ఆసుపత్రిలో వన మహోత్సవ కార్యక్రమం

### పాల్గొన్న గ్రామ సర్పంచ్ ఆర్.శ్రీనివాస్ చించోడు వైద్య సిబ్బంది





**షాద్ నగర్,(ప్రజావినికిడి):**రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ కిరణ్మయి నిన్న వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని ప్రభుత్వ ఆవరణ కార్యాలయంలో వన మహోత్సవ కార్యక్రమం నిర్వహించాలని తెలియజేశారు. అడిషనల్ కలెక్టర్ కిరణ్మయి ఇచ్చిన ఆదేశాల మేరకు , ఈరోజు ప్రాథమిక ఆరోగ్య కేంద్రము చించోడు ఆసుపత్రి ఆవరణలో చించోడు ఆసుపత్రి వైద్య సిబ్బంది ఏర్పాటుచేసిన చెట్లు నాటే కార్యక్రమం ను, చించోడు సర్పంచ్ ఆర్.శ్రీనివాస్ చేతులమీదుగా ప్రారంభించారు. సర్పంచ్ ఆర్. శ్రీనివాస్ మొదట నేరేడు చెట్టు నాటి,ఆ చెట్టుకు నీళ్లు పోశారు.తదుపరి ఎమ్.ఎల్.హెచ్.పి.వైద్యాధికారి డాక్టర్ సంధ్యారాణి నిమ్మచెట్టు నాటి నీరు పోశారు.హెల్త్ ఎడ్యుకేటర్ జె.శ్రీనివాసులు జామ చెట్టు నాటి నీరు పోశారు. అలా గ్రామ వార్డు మెంబర్లు,విలేజ్ సెక్రటరీ,వైద్య సిబ్బంది అందరూ ఒక్కొక్కరు ఒక చెట్టు ఆస్పత్రి ఆవరణలో నాటారు.మంగళవారం రోజు చించోడు ఆసుపత్రి ఆవరణలో జామ చెట్లు,నిమ్మ చెట్లు,నేరడి చెట్లు మొత్తం 12 చెట్లు నాటడం జరిగింది అని హెల్త్ ఎడ్యుకేటర్ జె.శ్రీనివాసులు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో చించోడు సర్పంచ్ రాకల శ్రీనివాస్,వార్డ్ మెంబర్లు ఉమామహేశ్వర్ నాయక్,కుమ్మరి శేఖర్,విలేజ్ సెక్రటరీ జయపాల్ రెడ్డి,ఎం ఎల్ హెచ్ పి వైద్యాధికారులు సంధ్యారాణి,ప్రవీణ,మరియు హెల్త్ ఎడ్యుకేటర్ జె.శ్రీనివాసులు,హెల్త్ సూపర్వైజర్ శ్రీ రామ,ల్యాబ్ టెక్నీషియన్ అశోక్ కుమార్, స్టాఫ్ నర్స్ అరుణ,ఏఎన్ఎంలు అనురాధ,పుష్ప,మధువాణి మరియు ఆస్పత్రి కాంటిజెంటు వర్కర్లు మనెమ్మ ,శ్రీనివాస్ మరియు ఆశాలు మొదలుకు వారు పాల్గొన్నారు.

# కొండా సురేఖ మాజీ ఓఎస్డీ కేసు: జూబ్లీహిల్స్ సీఐపై వేటు

రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మాజీ ఓఎస్డీ (ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ) ఎన్. సుమంత్‌కు సంబంధించిన కేసులో జూబ్లీహిల్స్ సర్కిల్ ఇన్స్పెక్టర్‌పై వేటు పడింది. కేసు దర్యాప్తులో నిర్లక్ష్యం వహించారన్న ఆరోపణలతో స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్హెచ్ఓ) ముత్తు యాదవ్‌ను సస్పెండ్ చేస్తూ నగర పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కేసును పోలీసులు చేపట్టిన చేసిన తీరుపై విచారణకు కూడా ఆదేశించారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారిపై దాడి కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న సుమంత్ ఇప్పటికీ పరారీలో ఉన్నాడు. ఈ కేసులో ఫస్ట్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్ (ఎఫ్ఐఆర్) నమోదు చేయడంలో జాప్యం జరిగిందని, నిందితుడిని పట్టుకోవడంలో సీఐ విఫలమయ్యారని తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలోనే ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి సుమంత్ డ్రైవర్‌ను పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

# ఘనంగాఒ శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయం లో 25 వార్షికోత్సవ వేడుకలు





**షాద్ నగర్,(ప్రజావినికిడి):** షాద్ నగర్ పట్టణంలోని హాజిపల్లి రోడ్ లో గల విజయనగరంలో కాలనీ శ్రీ వీరాంజనేయ శాస్త్ర లింగేశ్వర స్వామి దేవాలయంలో ఆలయ 25 వ వార్షికోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు భాను శర్మ ,వెంకటకృష్ణ బృందం కార్యక్రమాలు చేయించారు. ఈ సందర్భంగా వీరాంజనేయ స్వామి దేవాలయంలో విశేషంగా స్వామివారికి గణపతి పూజ, పుణ్యావాచన మండపారాధన, మహాస్నపనం,మన్యు సూక్త హోమం,పూర్ణాహుతి బలి, రమా సహిత సత్యనారాయణ వ్రతం చేశారు.తదుపరి అన్న ప్రసాద వితరణ కొనసాగించారు ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# శంషాబాద్ పట్టణంలోని ఆర్బీ నగర్ లో ఘనంగా వన మహోత్సవం..

### వనమహోత్సవంలో పాల్గొని మొక్కలు నాటిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్..





**శంషాబాద్,(ప్రజావినికిడి):** జిహెచ్ఎంసి శంషాబాద్ సర్కిల్ పరిధిలోని ఆర్బీ నగర్ లో వన మహోత్సవం కార్యక్రమం అత్యంత ఉత్సాహంగా జరిగింది.ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై, పర్యావరణ పరిరక్షణలో భాగంగా స్వయంగా మొక్కలను నాటారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ,

పర్యావరణ సమతుల్యతను కాపాడటం మనందరి బాధ్యత అని గుర్తుచేశారు.ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని, నాటిన ప్రతి మొక్కనూ కంటికి రెప్పలా కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టేందుకు, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించేందుకు హరితహారం,వన మహోత్సవం లాంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు,పార్టీ నాయకులు ఆర్బీ నగర్ కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# శాంతి సందేశంతో మిలాద్-ఉన్-నబీ ర్యాలీ

### ప్రశాంత వాతావరణంలో ర్యాలీ నిర్వహణకు పోలీసుల సూచనలు





**షాద్‌నగర్,(ప్రజావినికిడి):** మిలాద్-ఉన్-నబీ పర్వదినాన్ని పురస్కరించుకుని షాద్‌నగర్‌లో బుధవారం నిర్వహించనున్న జులూస్ (శాంతి ర్యాలీ)కు సర్వం సిద్ధమైంది.ర్యాలీ ప్రశాంతంగా, క్రమశిక్షణతో జరిగేలా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం డీసీపీ కార్యాలయంలో ముస్లిం మత పెద్దలు,మైనారిటీ నాయకులు,కమిటీ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లతో పీస్ మీటింగ్ నిర్వహించారు.ఈ సందర్భంగా మత పెద్దలు మాట్లాడుతూ, ప్రవక్త మహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) బోధించిన శాంతి,కరుణ, సోదరభావం,మానవత్వం వంటి విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని పిలుపునిచ్చారు. కులమతాలకు అతీతంగా శాంతి,మానవాళి సంక్షేమం కోసం ప్రవక్త సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు.ర్యాలీలో పాల్గొనే యువత,ప్రజలు క్రమశిక్షణ పాటించాలని, ఇతరులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా గంగా-జమునా తెహజీబ్ సంప్రదాయానికి అనుగుణంగా ర్యాలీ నిర్వహించాలని సూచించారు. పోలీసుల సూచనలు, నిబంధనలు పాటిస్తూ శాంతిభద్రతల పరిరక్షణకు సహకరిస్తామని మత పెద్దలు తెలిపారు.ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా ర్యాలీబుధవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పటేల్ రోడ్ మసీదు నుంచి ఫరూక్‌నగర్ వరకు మిలాద్-ఉన్-నబీ శాంతి ర్యాలీ కొనసాగనుంది.ర్యాలీ సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా, ముఖ్యంగా అంబులెన్స్‌లు, అత్యవసర వాహనాలకు దారి ఇచ్చేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని పోలీసులు సూచించారు.ఈ సందర్భంగా డీసీపీ శిరీష,షాద్‌నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ,పట్టణ సీఐ సీతారాం మాట్లాడుతూ ర్యాలీని ప్రశాంతంగా,క్రమశిక్షణతో నిర్వహించాలని,ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు.సమావేశం అనంతరం పోలీస్ అధికారులకు వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో మత పెద్దలు,కమిటీ నాయకులు,ప్రజాప్రతినిధులు,కౌన్సిలర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతులు సేంద్రియ వ్యవసాయంపై మొగ్గుచూపాలి

### సమగ్ర వ్యవసాయ యాజమాన్యంపై రైతులకు అవగాహన



మాట్లాడుతున్న ఇంచార్జ్ మండల వ్యవసాయ అధికారి నిశాంత్ కుమార్

**కేశంపేట,(ప్రజావినికిడి):**రైతులు సమగ్ర వ్యవసాయ యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా పెట్టుబడి ఖర్చులను తగ్గించడంతో పాటు నేల సారాన్ని కాపాడుకోవచ్చని ఇన్‌చార్జి మండల వ్యవసాయ అధికారి నిశాంత్ కుమార్ తెలిపారు.మంగళవారం కొత్తపేట రైతు వేదికలో (ఆత్మ) శిక్షణ కార్యక్రమంలో భాగంగా రైతులకు సమగ్ర వ్యవసాయ యాజమాన్యం,జీవ ఎరువుల వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా నిశాంత్ కుమార్ మాట్లాడుతూ,పంటల సాగులో రసాయన ఎరువులు, పురుగుమందులపై అధికంగా ఆధారపడకుండా నేల ఆరోగ్యం, నీటి యాజమాన్యం,సేంద్రియ ఎరువులు,జీవ ఎరువులు,జీవ పురుగుమందులు,సమగ్ర సస్యరక్షణ వంటి అంశాలను సమన్వయం చేసుకోవాలని సూచించారు.రైజోబియం, అజోస్పిరిల్లం,అజోటోబాక్టర్, పీఎస్‌బీ,మైకోరైజా వంటి జీవ ఎరువులను సిఫారసు చేసిన మోతాదులో వినియోగిస్తే పంటలకు పోషకాల లభ్యత మెరుగుపడుతుందని వివరించారు.అధిక మోతాదులో రసాయన ఎరువుల వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించి,నేల పరీక్ష ఆధారంగా సమతుల్య ఎరువుల వినియోగం చేయాలని సూచించారు.పంట అవశేషాలను కాల్చకుండా నేలలో కలపడం,సేంద్రియ ఎరువుల వినియోగం,పంట మార్పిడి వంటి పద్ధతులతో నేల ఆరోగ్యాన్నిమెరుగుపరచుకోవచ్చన్నారు.కార్యక్రమంలో కొత్తపేట సర్పంచ్ పట్లూరి హైమావతి జగదీశ్వర్, వ్యవసాయ విస్తరణ అధికారి వినయ్,ఏటీఎం రవి,బీటీఎం శీలతో పాటు రైతులు కాడేమోని జంగయ్య,నక్క మల్లేష్, చౌడంపల్లి సంతు,శీను,గణేష్,అల్లే శీను,శ్రీధర్,పుట్నాల శ్రీకాంత్,వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# వేదాలు,యజ్ఞాల ప్రాముఖ్యతను భావితరాలకు తెలియజేయాలి

### మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ -యజ్ఞ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్






**జిల్లేడు చౌదరిగూడ,(ప్రజావినికిడి):** మండల కేంద్రంలోని ఆర్య సమాజ్ కార్యాలయంలో ఆర్య సమాజం ఆధ్వర్యంలో నిర్వహించిన 47వ శ్రావణ వేద ప్రచార సత్సంగం, యజ్ఞ కార్యక్రమంలో షాద్‌నగర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,మహర్షి దయానంద సరస్వతి ఆశయాలు,స్ఫూర్తితో ఆర్య సమాజాన్ని ముందుకు నడిపిస్తున్న పెద్దలను అభినందించారు.మహిళలు సైతం అన్ని రంగాల్లో రాణించేలా మహర్షి దయానంద సరస్వతి కృషి చేశారని పేర్కొన్నారు. ప్రపంచ శాంతి,సమాజ శ్రేయస్సు కోసం ఆర్య సమాజం చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. యజ్ఞాలు,యాగాల ద్వారా ప్రజల్లో ఆధ్యాత్మికతతో పాటు సత్ప్రవర్తన, సమాజం పట్ల బాధ్యత పెంపొందుతుందని అన్నారు.గ్రామాల్లో ఇటువంటి కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించడం ద్వారా ప్రజల్లో ఐక్యత,సానుకూల ఆలోచనలు పెంపొందుతాయని పేర్కొన్నారు. భవిష్యత్ తరాలకు వేదాలు,యజ్ఞాల ప్రాముఖ్యతను తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. సమాజ శ్రేయస్సు కోసం అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.ప్రతి సంవత్సరం ఆర్య సమాజం ఆధ్వర్యంలో ఇలాంటి ఆధ్యాత్మిక,సామాజిక కార్యక్రమాలను నిర్వహిస్తున్న పెద్దలకు అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో యజ్ఞ బ్రహ్మలు అరవింద శాస్త్రి, డా.వసుధా శాస్త్రి,ఆర్య సమాజ్ రాష్ట్ర అధ్యక్షులు విఠల్ రావు ఆర్య,చౌదరిగూడ ఆర్య సమాజ్ అధ్యక్షులు మచ్చ సుధాకర్ రావు, నర్సింగ్ రావు, ఈట గణేష్,రాజేష్ పటేల్,మన్నే నారాయణ యాదవ్,శ్రీధర్ రెడ్డి,సయ్యద్ హఫీజ్, ఎదిర రామకృష్ణ,బాబురావు,సత్య ప్రమోద్ పంతులు,జిల్లేడు వెంకటేష్,కొండి యాదయ్య, మోతీలాల్ నాయక్,అంకం శేఖర్,మంగలి శేఖర్, రామచంద్రయ్య,నారాయణ గౌడ్, నీరున్న,భూపాల్ రెడ్డి,నరేష్ గౌడ్, మానయ్య, దానగల్ల రాములు, శివరాజ్,దామోదర్ రెడ్డి,రవి నాయక్,రామ్ చరణ్,శివ రాములు గౌడ్,జాకారం వెంకన్న తదితరులు పాల్గొన్నారు

# జీవో 97ను వెంటనే రద్దు చేసి, పాలిటెక్నిక్ విద్యార్థుల భవితకు భరోసా ఇవ్వాలి



**కొత్తూరు, (ప్రజావినికిడి):**పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చేలా ఉన్న 'జీవో 97'ను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని బీజేపీ కొత్తూరు మండల అధ్యక్షులు అత్తాపురం మహేందర్ రెడ్డి డిమాండ్ చేశారు.విద్యార్థుల పక్షాన నిలబడి న్యాయపోరాటం చేస్తున్న నాయకులపై ప్రభుత్వం అక్రమంగాకేసులుబనాయించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.విద్యార్థుల హక్కుల కోసం గళమెత్తినందుకు బీజేపీ నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి పై కక్షసాధింపు చర్యల్లో భాగంగా పెట్టిన కేసులను ప్రభుత్వం వెంటనే, బేషరతుగాఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.ప్రజాసమస్యలపై,విద్యార్థుల భవిష్యత్తు కోసం పోరాడే గొంతులను అక్రమ కేసులతో అణచివేయలేరని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పాలిటెక్నిక్ విద్యార్థుల భవితకు స్పష్టమైన భరోసా కల్పించేంత వరకు బీజేపీ వారి పక్షాన పోరాడుతుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ కొదుర్గు మండల అధ్యక్షుడు చిట్టెం లక్ష్మీకాంతరెడ్డి,బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యులు కే. మహేష్,హాజిపల్లి గ్రామ ఉపసర్పంచ్ ఇస్నాతీ గంగాధర్,కృష్ణ యాదవ్,హనుమంత్ బీజేపీ నాయకులు,మహేష్ శివ,విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

# పేరూరులో ఘనంగా వన మహోత్సవం

### పచ్చదనం పరిశుభ్రత -మొక్కలు నాటుదాం పర్యావరణాన్ని కాపాడుదాం






**వాజేడు,ఆగస్టు 26,(ప్రజావినికిడి):** వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మొక్కలు నాటిన సర్పంచ్ సరోజినీ దేవి,పేరూరు ఎస్సై జి.కృష్ణ ప్రసాద్ గౌడ్ ఉపసర్పంచ్ సంపత్ కుమార్ గౌడ్,పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని, భావితరాలకు పచ్చని వాతావరణాన్ని అందించేందుకు పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు.పేరూరు గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,పల్లె ప్రకృతి సమతుల్యతను కాపాడటంలో పాటు భవిష్యత్ తరాలను ఆరోగ్యకరమైన వాతావరణంలో అందించేందుకు చెట్లు కీలక పాత్ర పోషిస్తాయని,కేవలం మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించే బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలని కోరారు.గ్రామాల్లో పచ్చదనాన్ని పెంపొందించడానికి, పర్యావరణాన్ని కాపాడుకోవడానికి వనమహోత్సవం ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాల్లో మొక్కలు నాటి పచ్చని గ్రామంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటర్ మహేష్,ప్రాథమిక ఆరోగ్య శాఖ వైద్యాధికారి భాస్కర్,ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు బద్రి,హెచ్‌ఏ శ్రీను,ఏఎన్‌ఎం శకుంతల,వైద్య సిబ్బంది,పోలీస్ సిబ్బంది,వార్డు సభ్యులు గొడ్డే శరత్,కుర్సం సాయిబాబు,పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు, విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.


**గుమ్మడిదొడ్డి గ్రామ పంచాయతీలో వన మహోత్సవం**

వాజేడు, దూలపురం, రేంజ్ వెంకటాపురం డివిజన్ అటవీ శాఖ ప్రణాళిక వన మహోత్సవం2026 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గుమ్మడిదొడ్డి గ్రామ పంచాయతీ పరిధిలో సర్పంచ్ బోదెబోయిన భరత్ కుమార్, దూలాపురం సర్పంచ్ విజయలక్ష్మి పంచాయతీ సెక్రెటరీ ప్రవీణ్, రేంజర్ నరేంధర్,సెక్షన్ ఆఫీసర్,చిన్నక్క,బీట్ ఆఫీసర్ ఆదిలక్ష్మి పాల్గొని మొక్కలు నాటారు.ఈ సందర్భంగా గుమ్మడిదొడ్డి సర్పంచ్ బోదెబోయిన భరత్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. గ్రామంలో పచ్చదనం పెంపొందించడంతో పాటు భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు మొక్కల సంరక్షణ ఎంతో ముఖ్యమన్నారు. ఈకార్యక్రమంలో గ్రామ ఝుజవత్ సిబ్బంది గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఎపిలో సోలార్ విద్యుత్‌కు ప్రాధాన్యం

### పునరుత్పాదక ఇంధన రంగంలో ముందుంటాం

### హులికెరలో సుజ్లాన్ విండ్ పవర్‌కు శంకుస్థాపప




**అనంతపురం,ఆగస్టు 25:.(ప్రజావినికిడి):**ఆంధ్రప్రదేశ్‌ను పునరుత్పాదక ఇంధన రంగంలో దేశంలోనే ప్రథమ స్థానంలో నిలబెట్టడమే ప్రభుత్వ లక్ష్యమని ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. అనంతపురం జిల్లాలో సుజ్లాన్ గ్రూప్ చేపడుతున్న ప్రాజెక్టుల నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అదనంగా 1.3 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని అందుబాటులోకి తీసుకురావడానికి సుజ్లాన్ గ్రూప్ పెట్టుబడులు పెడుతోందని నారా లోకేష్ వెల్లడించారు. ఉరుకొండ వద్ద ఉన్న బ్లేడ్ల తయారీ యూనిట్ విస్తరణతో పాటు కొత్త ప్రాజెక్టుల ద్వారా దాదాపు 4,000 ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. 2016లో ప్రారంభమైన అనంతపురం సుజ్లాన్ ప్లాంట్ ద్వారా ఇప్పటికే సుమారు 2,000 మందికి ఉపాధి లభించిందని మంత్రి పేర్కొన్నారు. ఇందులో దాదాపు 70 శాతం మంది స్థానిక యువత ఉండటం సంతోషకరమన్నారు. స్థానిక ఐటీఐలను దత్తత తీసుకుని శిక్షణ అందించడం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. సుజ్లాన్ సంస్థ వర్క్‌ఫోర్స్‌లో 40 శాతం మంది మహిళలు ఉండటం అభినందనీయమని నారా లోకేష్ అన్నారు. పరిశ్రమల అభివృద్ధితో పాటు స్థానికులకు ఉద్యోగ అవకాశాలు పెరగడంపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారిస్తోందని తెలిపారు. పారిశ్రామికవేత్తలు, ప్రభుత్వ అధికారులతో నెలవారీ సమావేశాలు నిర్వహించి పరిశ్రమలకు ఎదురయ్యే సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు ప్రత్యేక అడ్వైజరీ బోర్డును ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. పెట్టుబడులు ఆలస్యం కాకుండా 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానంలో వేగవంతమైన నిర్ణయాలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో పునరుత్పాదక ఇంధన రంగానికి అనుకూలమైన వాతావరణాన్ని మరింత బలోపేతం చేసి భారీ పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని నారా లోకేష్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అన్ని ప్రాంతాల్లో సోలార్ విద్యుత్ ఏర్పాటును ప్రోత్సహిస్తున్నామని మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. తిరుపతిలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. మంగళవారం అనంతపురం జిల్లా రాయదుర్గం నియోజకవర్గంలోని కణెకల్లు మండలం హులికెరలో సుజ్లాన్ విండ్ పవర్ ప్రాజెక్ట్‌కు మంత్రి లోకేశ్ శంకుస్థాపన చేశారు. అలాగే సుజ్లాన్ 144 న్యూ బ్లేడ్ ప్రొడక్షన్ లైన్స్‌ను ప్రారంభించారు. అనంతపురం జిల్లాలో సుజ్లాన్ సంస్థ రూ.10 వేల కోట్ల పెట్టుబడితో 1,325 మెగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్టులను ఏర్పాటు చేయనుంది. పవన విద్యుత్ ప్రాజెక్టుల ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 4 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు సుజ్లాన్ సంస్థ ప్రకటించింది. రాష్ట్రంలో సుజ్లాన్ ఇప్పటికే కీలక పవన్ విద్యుత్ సంస్థగా ఎదిగింది. ఏపీలో ఈ సంస్థకు 1700 మెగావాట్లకు పైగా స్థాపిత సామర్థ్యం ఉంది. ఇది 2030 నాటికి అదనంగా 5 వేల మెగావాట్ల పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులను ఏర్పాటు చేయాలని సుజ్లాన్ ప్రణాళికలు రూపొందించింది. నిర్దేశించుకున్న లక్ష్యానికి చేరుకునేందుకు ఈ సంస్థ ముందుకు సాగుతోంది.

# ఏజెన్సీ ప్రాంతంలో పీసా గ్రామ సభలకు ప్రాధాన్యత ఇవ్వాలి

### మండల పరిషత్ అభివృద్ధి అధికారికి వినతి పత్రం అందజేసిన గోండ్వాన సంక్షేమ పరిషత్

### పిసా గ్రామ సభల ద్వారానే ఏజెన్సీ గ్రామాలు అభివృద్ధి బాట




**వాజేడు,ఆగస్టు 26,(ప్రజావినికిడి):** షెడ్యూల్ ప్రాంతాలలో పిసా గ్రామ సభలకే ప్రాధాన్యత ఇవ్వాలని గొండ్వానా సంక్షేమ పరిషత్ డిమాండ్ చేశారు.ఏజెన్సీలో పిసా గ్రామసభల ద్వారానే అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని అదేవిధంగా 1/70కి విరుద్ధంగా అక్రమ వలసదారులకు ఇంటి పన్నులు,ఇంటి నిర్మాణాలకు అనుమతులు ఇవ్వకూడదని వెంకటాపురం మండల ఎంపీడీవో కి వినతి పత్రం అందజేయడం జరిగింది ఈ సందర్భంగా గొండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూనెం సాయి,జిల్లా అధ్యక్షుడు పూనెం ప్రతాప్ మాట్లాడుతూ.ఏజెన్సీ ప్రాంతాలలో పీసా చట్టం ప్రకారం గ్రామ సభలను నిర్వహించి, గిరిజనులకు స్వయం పాలన స్థానిక వనరులపై పూర్తి అధికారాలు కల్పించాలనీ డిమాండ్ చేశారు.పీసా గ్రామ సభల ముఖ్యమైన అధికారాలు ఉంటాయని,ఆదివాసి భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడటం కోల్పోయిన భూమిని వెనక్కి తీసుకోవడం.చిన్న తరహా అటవీ ఉత్పత్తులపై పూర్తి యాజమాన్య హక్కులు కలిగి ఉంటాయని అన్నారు.గ్రామంలో చేపట్టే అభివృద్ధి పనులకు, ప్రాజెక్టులకు లబ్ధిదారుల ఎంపికకు పీసాగ్రామ సభ ఆమోదం తప్పనిసరి ఉండాలని అధికార యంత్రాంగానికి తెలియజేశారు.1/70 చట్టానికి విరుద్ధంగా గిరిజనేతరుల భూములు విక్రయాలపై అలాగే వారి అక్రమ నిర్మాణాలు చేపట్టిన వాటిపై ఎల్.టి.ఆర్ కేసులు నమోదు చేసి,ఇంటి పన్నులు నియంత్రణ చేయాలని కోరారు.ఆంధ్ర ప్రాంతం నుండి వలస వస్తున్న గిరిజనేతరులకు ఎలాంటి హక్కు కలిగించవద్దని,వారికి ఎలాంటి కాంట్రాక్ట్ పనులు తీర్మానం చేయకూడదని,ఆ కాంట్రాక్ట్స్ వర్క్ కేవలం ఆదివాసి లకే కేటాయించాలని వెంకటాపురం మండలం సర్పంచులనీ కోరారు.వలస నిరోధక చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని,ఏజెన్సీ గ్రామంలోని సామాజిక వనరుల నిర్వహణ బాధ్యత పిసాగ్రామ సభదే తెలిపారు.రాబోయే రోజుల్లో పిసా గ్రామసభ ముఖ్య ప్రాధాన్యత ఉండాలని,లేని పక్షంలో ఆదివాసి సంఘాల ఆధ్వర్యంలో అనేక ఆ ఆందోళన కార్యక్రమాలు ప్రభుత్వం దృష్టికి వెళ్లేలా చేపడతామని ఈ సందర్భంగా తెలిపారు.

## 15వ హానరరీ గ్రాండ్ మాస్టర్ అవార్డును పొందిన

# ప్రముఖ ఫోటోగ్రాఫర్ ఎం.సి.శేఖర్



**హిమాయత్ నగర్, (ప్రజావినికిడి):**
ప్రపంచ ఫోటోగ్రఫీ రంగములో 15 వ హానరరీ గ్రాండ్ మాస్టర్ అవార్డును హైదరాబాద్ కు చెందిన ప్రముఖ అంతర్జాతీయ ఫోటోగ్రాఫర్ ఎం.సి.శేఖర్ పొందారు. సృజనాత్మక ఫోటోగ్రఫీ రంగంలో విశిష్ట సేవ,అసాధారణ కళాత్మక విజయాలు, ప్రపంచ కళా ఛాయాచిత్ర సమాజానికి చేసిన కృషికి గాను ఛాయాచిత్రకారులను గుర్తిస్తూ, ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం 2026 ను పురస్కరించుకుని 'టర్కీ' కి చెందిన ప్రముఖ అంతర్జాతీయ ఫోటోగ్రామ్ ఫోటో క్లబ్ ,ఈ సంవత్సరానికి గాను హానరరీ గ్రాండ్ మాస్టర్ - ప్రతిభను ఎం.సి.శేఖర్ కు ప్రకటించింది. సిగ్మా అకాడమీ ఆఫ్ ఫోటోగ్రఫీ వ్యవస్థాపకులుగా ఉన్న ఎం.సి.శేఖర్ గత 36 సంవత్సరాలుగా సహజ కాంతిని ఉపయోగించి గిరిజన సంస్కృతి, జీవనశైలిని చిత్రీకరించడంలో ఆయన చేసిన విశిష్టమైన కృషికి ఇప్పటికే 1000కి పైగా అంతర్జాతీయ అవార్డులు,170 కి పైగా ఫోటోగ్రఫీ ఆనర్స్ పొంది గిన్నిస్ బుక్ అఫ్ వరల్డ్ రికార్డ్స్ లో చేరువలో ఉన్నారు.ఈ సందర్భంగా ఎం.సి.శేఖర్ మాట్లాడుతూ ఫోటోగ్రఫీ ప్రోత్సాహం కోసం వివిధ ఉచిత ఫోటోగ్రఫీ శిక్షణ తరగతులు, వర్క్‌షాప్‌లు, సెమినార్లు,ఫోటో పోటీలు సిగ్మా అకాడమీ ఆఫ్



ఫోటోగ్రఫీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నానని, అసాధారణమైన గ్లోబల్ పోర్ట్‌ఫోలియోలు కలిగి, అంతర్జాతీయ ఛాయాచిత్ర రంగంలో విజయాలు, ఛాయా చిత్ర కళాభివృద్ధికి అందించిన విస్తృతమైన సహకారానికి గుర్తింపుగా అంతర్జాతీయ ఫోటోగ్రఫీ సంస్థలు తనకు అత్యున్నత జీవితకాల పురస్కారలను అందించినందుకు ఎం.సి.శేఖర్ ధన్యవాదాలు తెలిపారు.

# నకిలీ వైద్యుల ముఠా గుట్టురట్టు..

**డాక్టర్ ముసుగులో ప్రాణాలతో చెలగాటం..**
**ఆరుగురు అరెస్ట్**
**సెలైన్లు.. ఇంజెక్షన్లు.. కుట్లు! అర్హత లేకుండానే వైద్యం..**
**హైదరాబాద్ నగరంలో ఇప్పటికే 600కు పైగా నకిలీ వైద్యులపై కేసులు..**
**అయినా ఆగని దందా..**
**రోజుకు 40-50 మంది రోగులు..**
**రూ.200 వరకు ఫీజు వసూలు**




**హైదరాబాద్,(ప్రజావినికిడి):**
నగరంలో నకిలీ వైద్య వ్యవస్థ ఏ స్థాయిలో వేళ్లూనుకుపోయిందో స్పష్టం చేస్తున్నాయి. ఫార్మసీ,ఫస్ట్ ఎయిడ్ సెంటర్, చిన్న క్లినిక్ పేరుతో ప్రారంభమయ్యే వ్యవహారం చివరకు ఇంజెక్షన్లు,ఐవీ సెలైన్లు, యాంటీబయాటిక్స్, కుట్లు వేసే స్థాయికి చేరుతోంది. ముఖ్యంగా తక్కువ ఫీజు, ఇంటి దగ్గరే చికిత్స,వెంటనే ఇంజెక్షన్ లేదా సెలైన్ వేస్తామనే ప్రచారం పేద, మధ్యతరగతి ప్రజలను ఆకర్షిస్తోంది. వైద్యుడి అర్హతలను పరిశీలించకుండా చికిత్స చేయించుకోవడం వల్ల తప్పు మందులు,తప్పు మోతాదులు, ఆలస్యమైన రిఫరల్ వంటి పరిణామాలు తీవ్ర ఆరోగ్య సమస్యలకు దారితీసే ప్రమాదం ఉందని నిపుణులైన డాక్టర్లు హెచ్చరిస్తున్నారు హైదరాబాద్ వైద్యం పేరుతో నగరంలో సాగుతున్న దందా మరోసారి బట్టబయలైంది. వైద్య విద్య లేదు..వైద్య అర్హత లేదు.. కానీ మెడలో స్టెతస్కోప్ వేసుకుంటే చాలు డాక్టర్ అవతారం! జబ్బుతో వచ్చిన అమాయకుల ప్రాణాలను పణంగా పెట్టి సెలైన్లు, ఇంజెక్షన్లు, మందులు ఇవ్వడమే కాకుండా సర్జికల్ కుట్లు వేస్తున్న నకిలీ వైద్యుల గుట్టును జూబ్లీహిల్స్ జోన్ పోలీసులు రట్టు చేశారు. జూబ్లీహిల్స్ జోన్‌లో సోమవారం నిర్వహించిన విస్తృత దాడుల్లో ఆరుగురు నకిలీ వైద్యులను అరెస్ట్ చేశారు. మంగళవారం హైదరాబాద్ నగర డీసీపీ టాస్క్ ఫోర్స్ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్ మీడియా సమావేశంలో నకిలీ డాక్టర్ల వివరాలను వెల్లడించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నకిలీ డాక్టర్ల నుంచి ఇంజెక్షన్లు, సెలైన్ బాటిళ్లు, సిరంజిలు, యాంటీబయాటిక్స్, వైద్య పరికరాలు, గడువు ముగిసిన మందులు తదితరాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.ఈ వ్యవహారం ఒక్క జోన్‌కు పరిమితమైనది కాదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.నగరంలో ఇప్పటికే 600కు పైగా నకిలీ వైద్యులపై కేసులు నమోదైనప్పటికీ.. డాక్టర్ ముసుగులో అక్రమ వైద్యం నిర్వహిస్తున్న వారిపై దాడులు నిర్వహించనున్నట్లు తెలిపారు.

**ఫస్ట్ ఎయిడ్ సెంటర్..లోపల నకిలీ వైద్యం!**
రహమత్‌నగర్ ఎక్స్‌రోడ్డు సమీపంలోని శ్రీ ఆక్వా ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌పై మధురానగర్ పోలీసులు దాడి చేసి ఇద్దరిని అరెస్ట్ చేశారు. డి. రామశేఖర్‌రెడ్డి (43) తన భార్య పేరుతో ఉన్న ఫార్మసీని ఆధారంగా చేసుకుని 2015 నుంచి వైద్యం అందిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. మరో నిందితుడు రాగం సుధాకర్ (38) అనస్థీషియా టెక్నీషియన్ డిప్లొమా చేసి డాక్టర్‌గా చెలామణి అవుతూ రోజుకు 40–50 మంది రోగులకు రూ.200 చొప్పున ఫీజు వసూలు చేస్తున్నట్లు తేలిందన్నారు. దీనితో పాటు గడువు ముగిసిన ట్రామడాల్ ఇంజెక్షన్లు,సెలైన్ బాటిళు ,,బటర్‌ఫ్లై నీడిల్స్,సర్జికల్ కత్తెర్లు తదితరాలను స్వాధీనం చేసుకున్నారు.

**చిన్నారులకూ 'చికిత్స'..అర్హత మాత్రం శూన్యం**
రహమత్‌నగర్‌లోనే మిరుదొడ్డి భారతి (44) గతంలో నర్సుగా పనిచేసిన అనుభవంతో ఎలాంటి అనుమతులు లేకుండా క్లినిక్ నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. రోజుకు 10–15 మంది రోగులకు, చిన్నారులకు సైతం చికిత్స అందిస్తూ రూ.50 నుంచి రూ.100 వరకు ఫీజు వసూలు చేస్తున్నట్లు వెల్లడైంది. ఆమె వద్ద యాంటీబయాటిక్స్,పిల్లల సిరప్‌లు,ప్రెగ్నెన్సీ కిట్లు,బీపీ మెషిన్, స్టెతస్కోప్,సెలైన్ సెట్లు,సిరంజిలు తదితరాలను స్వాధీనం చేసుకున్నారు.

**బీఏ చదివి.. డాక్టర్ అవతారం!**
వెంకటగిరిలో కాటిక మహేష్‌రావు (43) బీఏ చదివి రెండేళ్లుగా ఒక గదిని అద్దెకు తీసుకుని పేరు లేకుండానే క్లినిక్ నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. రోజుకు 40–50 మంది రోగులకు చికిత్స చేస్తూ సెలైన్లు వేస్తున్నాడు. సిరంజిలు, డిక్లోటాల్ ఇంజెక్షన్లు,బీపీ మెషిన్,కత్తెర్లు స్వాధీనం చేసుకున్నారు.

**కూతురు ఎంబీబీఎస్ చదువుతుంటే.. తండ్రి డాక్టర్!**
ఫిల్మ్‌నగర్‌లోని శ్రీ సాయి తిరుమల క్లినిక్ వ్యవహారం మరింత విస్మయానికి గురిచేసింది. ఫార్మసీ నిర్వహిస్తున్న పానుగంటి బాల నరసింహ (52), ఉస్మానియా మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ పూర్తి చేసి పీజీకి సిద్ధమవుతున్న తన కుమార్తె పేరును ఉపయోగించుకుని పక్కనే క్లినిక్ ఏర్పాటు



చేసినట్లు పోలీసులు తెలిపారు.తాను డాక్టర్‌గా నటిస్తూ రోజుకు 3040 మంది రోగులకు చికిత్స చేసి ఒక్కొక్కరి నుంచి రూ.100 వసూలు చేస్తున్నట్లు గుర్తించారు. ప్రిస్క్రిప్షన్ పుస్తకాలు, స్టెతస్కోప్, సిరంజిలు, ఇంజెక్షన్లు స్వాధీనం చేసుకున్నారు.

**ల్యాబ్ టెక్నీషియన్ అనుభవంతో 'డాక్టర్'గా!**
బోరబండ గంగానగర్‌లో మహమ్మద్ అబ్దుల్ వలీ (54) ఇంటర్ మధ్యలోనే చదువు ఆపేసి, గతంలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేసిన అనుభవంతో క్లినిక్ ఏర్పాటు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. రోజుకు 10–20 మంది రోగులకు చికిత్స అందిస్తున్న అతని వద్ద జెంటామైసిన్, పారాసిటమాల్, డెక్సామెథాసోన్, ఆండన్‌సెట్రాన్ వంటి ఇంజెక్షన్లు, బీపీ మెషిన్ స్వాధీనం చేసుకున్నారు.

**'డాక్టర్' బోర్డు కనిపిస్తే సరిపోదు!**
ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలి. వైద్యుడి అర్హత, రిజిస్ట్రేషన్,క్లినిక్ అనుమతులు వంటి అంశాలను పరిశీలించకుండా చికిత్స చేయించుకోవడం ప్రమాదకరం. ముఖ్యంగా సెలైన్,ఇంజెక్షన్, యాంటీబయాటిక్ లేదా కుట్లు వేయడం వంటి చికిత్సలను అర్హత లేని వ్యక్తుల వద్ద చేయించుకోవద్దని అధికారులు సూచిస్తున్నారు.
కమీషనర్ టాస్క్‌ఫోర్స్ జూబ్లీహిల్స్ జోన్ బృందం నిర్వహించిన ఈ దాడిలో ఇన్‌స్పెక్టర్ సీహెచ్. యాదేందర్, ఎస్ఐలు మహమ్మద్ జాహెద్,జి. సందీప్‌రెడ్డి,డి. రవిరాజ్ తదితరులు పాల్గొన్నారు. నిందితులను, స్వాధీనం చేసుకున్న సామగ్రిని తదుపరి చట్టపరమైన చర్యల కోసం సంబంధిత పోలీస్ స్టేషన్లకు అప్పగించారు

# చరిత్ర గమనాన్ని మార్చే శక్తి ఫోటో జర్నలిస్టులకు ఉంటుంది

**మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య**

**నాంపల్లి, (ప్రజావినికిడి ):**
తీసే ప్రతి చిత్రం చారిత్రక రికార్డులో ఒక భాగమై,చరిత్ర గమనాన్ని మార్చే శక్తి ఫోటోజర్నలిస్టులకు ఉంటుందని మాజీ మంత్రి, పొన్నాల ఫౌండేషన్ చైర్మన్ పొన్నాల లక్ష్మయ్య తెలిపారు. హైదరాబాద్, బషీర్ బాగ్, దేశోద్ధారక భవన్ లో తెలంగాణ రాష్ట్ర ఫోటో జర్నలిస్టుల సంఘం ఏర్పాటు చేసిన ఉత్తమ వార్త చిత్రాల ప్రదర్శన 2026ను మంగళవారం పొన్నాల లక్ష్మయ్య తిలకించారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ, ఫోటో జర్నలిజానికి తగిన అద్భుతమైన ఛాయాచిత్రాలు మన రాష్ట్రానికి చెందిన ఫోటో జర్నలిస్టులు ప్రదర్శించడం అభినందనీయమన్నారు.



నేటి సమాజంలో ఫోటో జర్నలిజం అత్యంత కీలకం అని,ఇది వాస్తవ సంఘటనలను చూపడానికి, వాస్తవాలను నిరూపించడానికి, అన్యాయాన్ని బయటపెట్టడానికి నిజాయితీతో కూడిన చిత్రాలను ఉపయోగిస్తుందని తెలిపారు. మనం తెరలు, సోషల్ మీడియా, కృత్రిమ చిత్రాలతో నిండిన ప్రపంచంలో నేడు జీవిస్తున్నామని, ఫోటోజర్నలిస్టులు వాస్తవికతకు స్పష్టమైన అద్దంలా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఫోటోజర్నలిస్టుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎన్.హరి, ఉపాధ్యక్షులు టి. కిషోర్ సింగ్,పి. రామ్మూర్తి, కోశాధికారి కె. అనిల్ కుమార్, కార్యవర్గ సభ్యులు పి. హరికృష్ణ,ఏ. మహేష్ కుమార్, ఎన్.శివ కుమార్,నగర గోపాల్, నాయకులూ ఏ. పవన్ కుమార్, ఎండి.బషీర్,కె. సుమన్ రెడ్డి, కుంట్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

## ఊరూరా పచ్చదనం
## పల్లె పల్లెనా వన మహోత్సవ సంబరం





**జిల్లేడు చౌదరిగుడ,(ప్రజావినికిడి):**
తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లేడు చౌదరిగూడెం మండల పరిధిలోని జాకారం గ్రామ పంచాయతీలో మొక్కల పెంపకం కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జాకారం గ్రామ సర్పంచ్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎన్.చంద్రశేఖర్ పాల్గొని స్వయంగా మొక్కలు నాటారు.పర్యావరణ పరిరక్షణ గ్రామాన్ని పచ్చదనంతో నింపడమే లక్ష్యంగా గ్రామ పంచాయతీ ఆవరణలో మరియు రహదారుల వెంట మొక్కలను నాటడం జరిగింది.గ్రామ ప్రజలు,ప్రజాప్రతినిధులు నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలను నాటడమే కాకుండా,వాటిని సంరక్షించి మహావృక్షాలుగా పెంచాలని ఎన్.చంద్రశేఖర్ పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన అవసరాన్ని మరియు పచ్చదనం వల్ల కలిగే ప్రయోజనాలను గ్రామస్తులకు వివరించారు.

## వెంకటాపురం పోలీస్ స్టేషన్ అకస్మిక తనిఖీ చేసిన ఎఎస్పి





**వాజేడు,ఆగస్టు 26,(ప్రజావినికిడి):**
వెంకటాపురం పోలీస్ స్టేషన్ లో ఏటూరునాగారం ఎఎస్పి మనన్ భట్,ఐపిఎస్ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. పోలీస్ స్టేషన్ రికార్డ్స్,క్రైమ్ ఫైల్స్,పోలీస్ స్టేషన్ పరిసరాలు, ఆయుధాల పనితీరు పరిశీలించారు. రోడ్డు ప్రమాదాలు, సైబర్ క్రైమ్, మత్తు పదార్థాలు, రవాణాపై ప్రత్యేక దృష్టి సాధించాలని సూచించడం జరిగింది.అదేవిధంగా ఆన్లైన్ పోర్టల్స్ సిసిటిఎస్ఎస్, ఐఆర్ఎడి (రోడ్డు ప్రమాదాల పోర్టల్)అలాగే సిఈఐఆర్,(పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ల రికవరీ) గురించి సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేసారు ,ఆ తర్వాత పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో నుగురు వెంకటాపురం సిఐ,ముత్యం రమేష్,ఎస్సైలు తిరుపతిరావు, తిరుపతిరెడ్డి, సాయికృష్ణ, పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు

# ఓపెన్ జిమ్,చిల్డ్రన్స్ పార్క్ లను ప్రారంభించిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

**విజయ గార్డెన్స్ కాలనీలో ఓపెన్ జిమ్,చిల్డ్రన్స్ పార్క్ ప్రారంభం**



**నాగోల్,(ప్రజావినికిడి):**నాగోల్ డివిజన్ పరిధిలోని విజయ గార్డెన్స్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్‌లో నూతనంగా నిర్మించిన ఓపెన్ జిమ్ అలాగే చిల్డ్రన్స్ పార్క్‌ను ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా కాలనీ ప్రజలతో ఎమ్మెల్యే మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ప్రజల ఆరోగ్యం,పిల్లల ఆటలు మరియు ఆహ్లాదకరమైన వాతావరణం కోసం ఓపెన్ జిమ్,చిల్డ్రన్స్ పార్క్ ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు.కాలనీ ప్రజలు తమకు అవసరమైన సౌకర్యాలను కల్పించిన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ చెరుకు సంగీత ప్రశాంత్ గౌడ్,సీనియర్ నాయకులు ఆనంతుల రాజిరెడ్డి,డివిజన్ అధ్యక్షులు తూర్పటి.చిరంజీవి,శిల్పరెడ్డి,పోచంపల్లి రాజేందర్ రెడ్డి,కాలనీ అధ్యక్షులు రాంచంద్రరెడ్డి,మల్లారెడ్డి,సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# ఇరాన్‌పై ట్రంప్ ఆర్థిక యుద్ధం !



**ఆగస్టు 25:(ప్రజావినికిడి):**అమెరికా, ఇరాన్ యుద్ధంలో కొత్త అధ్యాయం మొదలయ్యింది. ఇరాన్‌ను ఆయుధాలతో దెబ్బతీయడం కుదరని పని అని అమెరికాకు తెలిసొచ్చింది. దీంతో ఇక ఆర్థిక యుద్ధం మొదలు పెట్టింది. దీంట్లోనూ ప్రపంచ దేశాలను లాగే యత్నం చేస్తోంది. ఇరాన్‌తో సంబంధాలు పెట్టుకునే దేశాలపైనా ఆంక్షలు కొనసాగిస్తామని ట్రంప్ ప్రకటించారు. ఆయుధంతో పోరాటమైనా, ఆర్థిక పోరాటమైనా తన పంతమే నెగ్గాలన్నది ట్రంప్ వాదనగా ఉంది. నేను చెప్పినట్లు వినాలన్న ధోరణితో అమెరికా ఇప్పుడు ప్రపంచ దేశాలకు హెచ్చరికలు చేస్తోంది. ఈ క్రమంలో ఇరాన్‌పై మొన్నటి వరకు భౌతిక దాడులకు పాల్పడిన అమెరికా ఇప్పుడు రూటు మార్చింది. సరికొత్త ఆంక్షల పేరుతో టెహ్రాన్ ఆర్థిక మూలాలను దెబ్బతీయాలని యోచిస్తున్నది. ఇందులో భాగంగా అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెసెం ఇరాన్‌పై చరిత్రలోనే అత్యంత తీవ్రమైన ఆర్థిక ఆంక్షలను ప్రకటించారు. 'ఆపరేషన్ ఎకనామిక్ అవుట్‌క్యాస్ట్' పేరుతో ఈ కొత్త ఆంక్షల ప్యాకేజీని ప్రకటించారు. కాగా, ఇరాన్ యుద్ధం ప్రపంచవ్యాప్తంగా అన్ని వర్గాలపై ప్రభావం చూపుతున్నది. పెరిగిన చమురు ధరలు జీవన వ్యయంపై ఆందోళనలను పెంచాయి. పెట్రోల్,డీజిల్ ధరలు ఏడాది క్రితం కంటే చాలా ఎక్కువగా ఉండంతో అమెరికాతో పాటు అన్ని దేశాలు ఇబ్బంది పడుతున్నాయి. మరో వైపు ఇరాన్‌పై ఆంక్షలను ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి నెతన్యాహు స్వాగతించారు. ఇరాన్ ఆర్థిక మూలాలను పూర్తిగా దెబ్బతీయడమే లక్ష్యంగా ఈ చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. టెహ్రాన్‌పై ఇది ఒక 'ఆర్థిక డి-డే' లాంటిదని హెచ్చరించారు. డిజిటల్ ఆస్తులు, టెక్నాలజీ, బంగారం, విమానయానం, నౌకా రవాణా వంటి కీలక రంగాలను ఈ ఆంక్షల పరిధిలోకి తీసుకొచ్చారు. ఇరాన్‌తో వ్యాపారం కొనసాగించే ఇతర దేశాలు, సంస్థలపై కూడా ద్వితీయ స్థాయి ఆంక్షలు విధించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. దీంతో పాటు ఇరాన్ చమురు ఆదాయం, ఆయుధాల సేకరణ, సైబర్ కార్యకలాపాలతో సంబంధం ఉన్న 60కి పైగా వ్యక్తులు, కంపెనీలు, నౌకలపై కూడా ఆంక్షలు విధించారు. ఇరాన్‌తో ఆర్థిక పోరులో ఇది చివరి అంకమని అమెరికా ప్రకటించింది. ఇరాన్‌తో సంబంధాలు తెంచుకోవాలని ప్రపంచ దేశాల నాయకులను కోరారు. మీరు మా వైపు ఉంటారా లేక మాకు వ్యతిరేకంగా ఉంటారా అని అల్టిమేటం జారీ చేశారు. ఇప్పటికే ఇరాన్‌కు మద్దతు ఇస్తున్న సుమారు 60 సంస్థలు, విదేశీ నౌకలపై అమెరికా నిఘా పెట్టింది. సహకరించే ఇతర దేశాలకూ ఆంక్షల భయం ఉంటుందని తెలిపారు. ఇరాన్‌తో ఆర్థికంగా భాగస్వామ్యం వహించే ఏ దేశమైనా ఏకాకిగా మిగిలిపోతుందని బెసెంట్ తెలిపారు. ఇరాన్‌పై కొన్నినెలలుగా దాడులు చేసిన అమెరికా ఇప్పుడు ఆర్థికంగా వెన్నువిరిచే ప్రయత్నాలు మొదలుపెట్టింది. అంతర్జాతీయంగా ఇరాన్‌కున్న ఆర్థిక సంబంధాలను తెంచేయడమే లక్ష్యంగా అగ్రరాజ్యం కొత్త ఆంక్షలను ప్రకటించింది. టెహ్రాన్‌తో సంబంధాలు కొనసాగిస్తూ, నగదు అక్రమ చలామణిలో దానికి తోడ్పడే దేశాలను డాలరు వ్యవస్థ నుంచి దూరం చేస్తామని యూఎస్ ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ ప్రకటించారు. దీనికి ఇరాన్ దీటుగా స్పందించింది. ట్రంప్ ప్రభుత్వం విధించిన ఆంక్షలను ఎదుర్కోవడానికి తమ వద్ద రెండేళ్ల ప్రణాళిక ఉందని, ప్రతీకార చర్యలు తప్పవని బదులిచ్చింది. ఇరాన్ పై అమెరికా ఆంక్షలు విధించడం కొత్తేం కాదు. ఇరాన్‌కు ప్రపంచంతో ఉన్న ఆర్థిక జీవనాధారాన్ని తెగ్గొట్టడమే తాజా ఆంక్షల లక్ష్యమని బెసెంట్ ప్రకటించారు.

## పిల్లల ద్వారా తల్లులను లోబరుచుకునే కొత్త రకం జిహాద్ ఇది

### : జనసేన ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ సంచలన ప్రెస్ మీట్

**బాధిత బాలుడికి న్యాయం జరిగే వరకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ**



**ఆగస్టు 25: (ప్రజావినికిడి):**ప్రశాంతతకు మారుపేరైన కాకినాడ నగరంలో జరిగిన ఒక దారుణ ఘటన యావత్ రాష్ట్రాన్ని ఉలిక్కిపడేలా చేసింది. సాదిక్ అనే వ్యక్తి పెట్టిన చిత్రహింసలు, వేధింపులు, బ్లాక్‌మెయిలింగ్ తట్టుకోలేక ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ఆత్మహత్యకు పాల్పడగా, వారిలో 13 ఏళ్ల బాలుడు రియాన్ష్ మాత్రం అదృష్టవశాత్తు ప్రాణాలతో బయటపడ్డాడు. కళ్లెదుటే తన కుటుంబం మొత్తం జలసమాధి అవుతున్న దృశ్యాన్ని చూసిన ఆ చిన్నారి చెప్పిన వాస్తవాలు గుండెలు పిండేస్తున్నాయి. ఈ ఘటన వెనుక ఉన్న ఘోరమైన కుట్రను, నిందితుడి పైశాచికత్వాన్ని జనసేన ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ మీడియా ముందు ఆ బాలుడితో సహా హాజరై వివరించారు.కాకినాడకు చెందిన ప్రముఖ మానేపల్లి జువెలర్స్ కుటుంబానికి చెందిన జగదీశ్ రెడ్డి, ప్రభుత్వ ఉద్యోగిని అయిన ఆయన భార్య, ఆమె తల్లిదండ్రులు.. ఈ నలుగురి మృతికి సాదిక్ అనే వ్యక్తి కారణమని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ తీవ్రంగా ఆరోపించారు. వారి కుమారుడైన రియాన్ష్ ప్రాణాలతో బయటపడి అసలు నిజాలను వెల్లడించాడని తెలిపారు. రియాన్ష్ కథనం ప్రకారం, షూటింగ్ కోచ్ అయిన సాదిక్.. మొదట తండ్రి జగదీశ్ రెడ్డిని లక్ష్యంగా చేసుకున్నాడు. ముంబై, కెనడా నుంచి ప్రమాదకర రసాయనాలు తెప్పించి, వాటిని ప్రోటీన్ షేక్‌లలో, ఆహారంలో కలిపి ఇచ్చి నెమ్మదిగా ఆయన్ను అనారోగ్యం పాలు చేసి, చివరికి ప్రాణాలు తీశాడని బాలుడు తెలిపాడు. ఈ విషయాన్ని చనిపోయే ముందు తల్లి రాసిన లేఖలో స్పష్టంగా పేర్కొన్నారని ఎంపీ వెల్లడించారు.ఆమె భర్త మరణం తర్వాత, సాదిక్ తన నిజ స్వరూపాన్ని బయటపెట్టాడు. రియాన్ష్ తల్లిని శారీరకంగా, మానసికంగా తీవ్రంగా హింసించడం మొదలుపెట్టాడు. ఆమెను రహస్యంగా వీడియోలు తీసి, వాటితో బ్లాక్‌మెయిల్ చేస్తూ ఆస్తులను తన పేరు మీద రాయించుకున్నాడు.ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన ఎంపీ ఉదయ్ శ్రీనివాస్, నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. "పెహల్గామ్‌లో 26 మందిని చంపిన ఉగ్రవాదుల గురించి దేశం మొత్తం మాట్లాడుకుంది. ఇక్కడ ఒక్కడే నలుగురిని చంపాడు. వాళ్లకంటే పెద్ద టెర్రరిస్ట్ వీడు. ఇలాంటి వాడిని ఉరితీయాలి" అని ఉద్వేగంగా అన్నారు. ఈ కేసును వెంటనే సీబీఐకి అప్పగించాలని, నిందితుడి వెనుక ఉన్న నెట్‌వర్క్‌ను, ఢిల్లీ సంబంధాలను, అతని ద్వారా మోసపోయిన ఇతర బాధితుల వివరాలను వెలికితీయాలని కోరారు. ఇది సాధారణ ఘటన కాదని, పిల్లల ద్వారా కుటుంబాల్లోకి ప్రవేశించి, తల్లులను లోబరుచుకుని, బ్లాక్‌మెయిల్ చేసి మత మార్పిడులకు పాల్పడే ఒక "కొత్త రకం లవ్ జిహాద్" అని ఆయన అభివర్ణించారు.

# తెలంగాణ మోడల్‌లో కులగణన

**జనగణనలో కులగణన విధానం సరిగా లేదు**

**ప్రశ్నావళి మార్చేందుకు అఖిలపక్షం ఏర్పాటు**

**ప్రధాని మోడీకీ రాహుల్, ఖర్గేల లేఖ**



**న్యూఢిల్లీఆగస్టు 25: (ప్రజావినికిడి):**జనగణన పద్ధతిపై కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే నిరసన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీకి మంగళవారం ఖర్గే, రాహుల్ సుదీర్ఘ లేఖ రాశారు. ఈ లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. కులగణలో తెలంగాణ మోడల్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. జనగణనలో కులాల నమోదుకు 'ఓపెన్-ఎండెడ్' విధానాన్ని అమలు చేయడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కులాల లెక్కింపు విధానాలతో తీవ్ర నష్టం జరుగుతోందని రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే ఆందోళన వ్యక్తం చేశారు. 'ఒకే కులం వేర్వేరు పేర్లతో విడిపోయి లక్షలాది కులాల పేర్లుగా నమోదవుతాయని.. దీనివల్ల లెక్కింపు డేటా పూర్తిగా నిరుపయోగంగా మారుతుందని తెలిపారు. ప్రశ్నావళిలో 'వెనుకబడిన వర్గాలు' అనే పదమే లేకపోవడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ తరహాలోనే బీసీ, ఓబీసీ కులాల నమోదుకూ 'డ్రాప్-డౌన్ జాబితా' విధానాన్ని ఉపయోగించాలని రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే సూచించారు. తెలంగాణ (2024), బిహార్ (2022) సర్వేల్లో వాడిన కులాల జాబితా నమూనాలను ప్రధానికి పంపించారు. ప్రస్తుత గందరగోళ ప్రశ్నావళిని వెంటనే రద్దు చేసి, అన్ని పార్టీలు - నిపుణులతో చర్చించి ఓ కొత్త ప్రశ్నావళిని రూపొందించాలని ఖర్గే, రాహుల్ డిమాండ్ చేశారు. ఇదిలావుంటే రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను అంతం చేయడానికి మోదీ ప్రభుత్వం కుట్రపన్నిందని, దీనిలో భాగంగానే కేంద్రానికి చెందిన వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న 8.2లక్షలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేయడంలేదని కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ధ్వజమెత్తారు.

మంత్రిత్వ శాఖల వారీగా ఖాళీగా ఉన్న పోస్టులపై మీడియా నివేదికను ఉటంకిస్తూ విమర్శలు సంధించారు. '2015లో కేంద్ర ప్రభుత్వ శాఖల్లో 4.21లక్షల ఉద్యోగాలు భర్తీకాకుండా ఉన్నాయి. 2024కు వాటి సంఖ్య 8.24 లక్షలకు చేరాయి. రైల్వేల్లో 2.40లక్షలు, కేంద్ర హోంశాఖ పరిధిలో 1.10 లక్షలు ఉద్యోగాలు భర్తీ చేయాల్సి ఉంది. ప్రభుత్వ రంగ సంస్థల్లోని 5.1 లక్షల శాశ్వత ఉద్యోగాలను రద్దు చేశారు. ఇవికాక రక్షణ రంగంలో 2.41 లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఖర్గే తెలిపారు. ఒప్పంద ఉద్యోగులు 19శాతం నుంచి 49శాతానికి పెరిగారని వెల్లడించారు. ఇది ఒక్క ఉపాధి సమస్య మాత్రమే కాదు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ వర్గాలకు చెందిన సామాజిక న్యాయం అంశం కూడా ఇమిడి ఉందని పేర్కొన్నారు. విద్య, ఉపాధి రంగాల్లో యువ భారతీయుల జీవితాలను మోదీ ప్రభుత్వం ధ్వంసం చేసిందని మల్లికార్జున ఖర్గే ధ్వజమెత్తారు. దేశంలో 15 నుంచి 29 ఏళ్ల వయసు గల 8.7 కోట్ల మంది యువత చదువులు, ఉపాధికి దూరమయ్యారని, వారికి ఎటువంటి నైపుణ్య శిక్షణలూ అందడంలేదన్నారు. నీతిఆయోగ్ నివేదికను ప్రస్తావిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. దేశంలో గత 40 ఏళ్లలో ఎన్నడూ లేనంతగా నిరుద్యోగుల శాతం పెరిగిందని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత ప్రియాంకా గాంధీ విమర్శించారు.

# అమెరికా చదువులపై విద్యార్థుల్లో అనాసక్తి


**ఉద్యోగార్థుల్లోనూ పెరుగుతున్న నిరాశ**

**ట్రంప్ ఆంక్షలతో విసుగెత్తుతున్న భారతీయులు**

**చదువుల కోసం వెళ్లేవారి సంఖ్య గణనీయంగా తగ్గుదల**

**వాషింగ్టన్,ఆగస్టు 25:** ట్రంప్ తీరుతో అమెరికాలో ఉంటున్న భారతీయులకు, అమెరికా వెళ్లాలనుకుంటున్న విద్యార్థులకు సైతం విసుగు వస్తోంది. పదేపదే ఏదో ఒక ఆంక్ష కారణంగా అక్కడి విశ్వవిద్యాలయాలు కూడా ఆర్థికంగా దెబ్బతింటున్నాయి. భారతీయ విద్యార్థుల రాక తగ్గిందని అక్కడి సంస్థలు ఆందోళన చెందుతున్నాయి. మాస్ డిపోర్టేషన్, అరెస్టులు, ఆంక్షలతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వలసదారులపై విరుచుకుపడుతున్నారు. దీంతో ఆ దేశానికి వెళ్లాలనుకునే భారత విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గిపోతోంది. 'కామన్ యాప్' నివేదికల ప్రకారం.. 2024-25 విద్యా సంవత్సరంలో వివిధ అండర్ గ్రాడ్యుయేషన్ కోర్సులలో 3.63 లక్షల మందికి పైగా భారతీయ విద్యార్థులు చేరారు.
ఇక 2025-26లో అమెరికా కళాశాలల్లో కోర్సులలో ప్రవేశం కోరే భారత విద్యార్థుల సంఖ్య 15శాతం పడిపోయింది. మరోవైపు 2026 సెమిస్టర్‌లో అమెరికా కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో అంతర్జాతీయ విద్యార్థుల నమోదులో కూడా 1.1 లక్షల తగ్గుదల కనిపించింది. 2025-26లో ఈ సంఖ్య 11.69 లక్షలుగా అంచనా వేయగా.. ఈ ఏడాది ఆ సంఖ్య 10.57 లక్షలకు చేరింది. కఠినమైన వీసా నిబంధనలు, చదువు పూర్తయిన తర్వాత ఉపాధి అవకాశాలపై అనిశ్చితి, సోషల్ మీడియా వెట్టింగ్ వంటి అంశాలే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. అయితే తాజా ఆంక్షల వార్తల కారణంగా అమెరికాలో ఉద్యోగం చేయాలన్న వారి సంఖ్య క్రమంగా తగ్గుతోంది. అలాగే అక్కడ చదువుకోవాలన్న ఆశను కూడా వదులుకుంటున్నారు. ఓపిటి నిబంధలను కఠినతరం చేయడం, వీసా ఫీజులు పెంచి నిబంధనలు మరింత క్లిష్టంగా మార్చడంతో భారతీయ విద్యార్థులు అమెరికావైపు చూసేందుకు ఇష్టపడడం లేదని సర్వేలు చెబుతున్నాయి. అమెరికా ఫస్ట్ నినాదంతో ట్రంప్ ఊగిపోతున్నాడు. అమెరికన్లకే శిక్షణ ఇవ్వాలని అక్కడి టెక్కీ సంస్థలపై ఒత్తిడి పెంచుతున్నారు. హెచ్-1బి వీసాల పై ట్రంప్ ప్రభుత్వం విధించిన కొత్త రుసుమును అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ సమర్థించారు. కంపెనీలు విదేశీ ఉద్యోగులను తీసుకోకుండా.. అమెరికన్లను నియమించుకోవాలని సూచించారు. వారికి మెరుగైన శిక్షణ ఇవ్వాలన్నారు.

# పోరాట పాఠం



**ఆగస్టు 25:(ప్రజావినికిడి)::**కొన్ని మరణాలు కన్నీళ్లను మాత్రమే మిగల్చవు... ఒక ఉద్యమాన్నే విషాదంలో ముంచుతాయి. కొన్ని వీడ్కోళ్లు ఒక వ్యక్తిని మాత్రమే మనకు దూరం చేయవు... ఒక తరం పోరాట అనుభవాన్ని, ఒక నిబద్ధతను, ఒక సైద్ధాంతిక జీవనాన్ని మన కండ్లముందు నిలబెడతాయి. సారంపల్లి మల్లారెడ్డి మరణం అలాంటి విషాదమే. సీపీఐ(ఎం) సీనియర్ నేతగా, రైతాంగ ఉద్యమ నాయకుడిగా, ప్రజల కోసం జీవితాన్ని అంకితం చేసిన పోరాట యోధుడిగా మల్లారెడ్డి పేరు తెలంగాణ రాజకీయ, సామాజిక చరిత్రలో చెరగని ముద్ర. తొమ్మిది దశాబ్దాల జీవితం ఆయనకు వయసును మాత్రమే ఇవ్వలేదు. అనుభవాన్ని ఇచ్చింది. పోరాటాన్ని నేర్పింది. ప్రజల కన్నీళ్లను తన కన్నీళ్లుగా భావించే హృదయాన్ని ఇచ్చింది. ముఖ్యంగా... ఎర్రజెండాను ఒక రాజకీయ గుర్తుగా కాకుండా, పేదల ఆశగా, రైతుల భరోసాగా, శ్రమజీవుల పోరాట ఆయుధంగా భావించిన వ్యక్తిత్వాన్ని ఇచ్చింది.1939 ఆగస్టు 25న జన్మించిన సారంపల్లి మల్లారెడ్డి తొమ్మిది దశాబ్దాల జీవితాన్ని తనకోసం కాదు... రైతు, కూలీ, పేదల హక్కుల కోసం అంకితం చేశారు. తిమ్మంపేటలో సామాజిక అసమానతలు, దోపిడీని కళ్లారా చూసిన ఆయన కుటుంబం కమ్యూనిస్టు భావజాలం వైపు అడుగులు వేసింది. అధికార వర్గాల ప్రతిఘటన, తప్పుడు కేసులు ఎదురైనా వెనక్కి తగ్గలేదు. ఆ అడ్డంకులే ఆయనలో పోరాట స్ఫూర్తిని మరింత పదును పెట్టాయి. కమ్యూనిస్టు ఉద్యమం కోసం అంకితమైన ఆయన జీవితం ఒక వ్యక్తి కథ కాదు... తెలంగాణ ప్రజా ఉద్యమ చరిత్రలో ఒక చెరగని అధ్యాయం.కమ్యూనిస్టు ఉద్యమంలో చీలికలు, నిర్బంధాలు ఎదురైనా తిమ్మంపేట ఎర్రజెండా కింద నిలిచింది. ఆ పోరాటానికి మల్లారెడ్డి వంటి నిబద్ధత కలిగిన కార్యకర్తలే వెన్నెముక. 1971ఆగస్టు 6న తిమ్మంపేటపై 200 మందితో కాంగ్రెస్ నాయకులు దాడికి దిగిన వేళ, రాజిరెడ్డి, చంద్రారెడ్డి తదితరుల నాయకత్వంలో కమ్యూనిస్టు కార్యకర్తలు ధైర్యంగా ప్రతిఘటించారు. అప్పట్లో పోలీస్ పటేల్‌గా ఉన్న మల్లారెడ్డి అధికారాన్ని ప్రజల కోసం ఉపయోగించి కార్యకర్తలకు అండగా నిలిచారు. దీంతో మల్లారెడ్డిని పోలీసుపటేల్ పదవి నుంచి సస్పెండ్ చేసి, 72 మందిపై కేసులు పెట్టి సెంట్రల్ జైలుకు పంపారు. ఈ నిర్బంధవార్త తెలుసుకున్న సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు ఎ.కె. గోపాలన్ తిమ్మంపేటకు చేరుకుని బాధిత కుటుంబాలకు అండగా నిలిచారు. అదే రోజు నర్సంపేటలో 20 వేల మందితో జరిగిన మహాసభ ఉద్యమానికి అఖండ ప్రజా మద్దతును చాటింది. ఆ పోరాట స్ఫూర్తే మల్లారెడ్డిని మరింత దృఢమైన ప్రజా ఉద్యమ నాయకుడిగా తీర్చిదిద్దింది.1973లో సీపీఐ(ఎం) పూర్తికాల కార్యకర్తగా మారిన మల్లారెడ్డి, తిమ్మంపేట అభివృద్ధిలోనూ కీలక పాత్ర పోషించారు. తిమ్మంపేటలో 42 ఏండ్ల ఎర్రజెండా ప్రజా పాలన ఒక చరిత్ర. పంచాయతీ, సింగిల్‌విండోలను ప్రజా ఉద్యమ స్ఫూర్తితో నడిపారు. సర్పంచ్‌గా సారంపల్లి మల్లారెడ్డి గ్రామాభివృద్ధికి విశేష కృషి చేశారు. పాఠశాల, పంచాయతీ భవనం, తాగునీరు, విద్యుద్దీకరణతో పాటు పేదలకు భూమి కోసం పోరాడారు. 1972లో ఆయన నేతృత్వంలో విద్యుద్దీకరణ కోసం ప్రజలే శ్రమదానం చేసి తమ గ్రామానికి వెలుగులు తెచ్చుకున్నారు. భూమిలేని పేదల కోసం 1967లో 110 ఎకరాల భూమిని సాధించి, అనంతరం పట్టాలు ఇప్పించారు. తిమ్మం పేటకు రోడ్లు, భవనాలు మాత్రమే కాదు... ప్రజలకు తమ హక్కుల కోసం పోరాడే ధైర్యాన్ని కూడా ఇచ్చింది ఈ ఉద్యమమే. సీపీఐ(ఎం) ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శిగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో, తెలంగాణ రాష్ట్రంలో రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మెన్‌గా, సీనియర్ నేతగా జీవితాంతం ప్రజా ఉద్యమానికే అంకితమయ్యారు.రైతు సంఘం నిర్మాణంలో సారంపల్లి మల్లారెడ్డి కీలక పాత్ర పోషించారు. డివిజన్ రైతు సంఘం కార్యదర్శి నుంచి అఖిల భారత కిసాన్ సభ ఉపాధ్యక్షుడి వరకు ఆయన ఎదిగిన ప్రస్థానం తెలంగాణ రైతాంగం ఆయనపై ఉంచిన విశ్వాసానికి ప్రతీక. రైతు సమస్యను కేవలం పంట సమస్యగా కాకుండా భూమి, నీరు, రుణాలు, గిట్టుబాటు ధరలు, వ్యవసాయ విధానాల వంటి విస్తృత అంశాలతో ఆయన చూశారు. అందుకే ఆయన కలం కూడా రైతాంగ పోరాటానికి ఆయుధమైంది.

# రెండో టెస్ట్‌లో టీమిండియా పట్టు




## తొలి ఇన్నింగ్స్‌లో 503/9 వద్ద డిక్లేర్డ్

## ముగిసిన మూడో రోజు ఆట..

శ్రీలంకతో రెండో టెస్ట్‌లో టీమిండియా పట్టు బిగించింది. బ్యాటింగ్ తరహాలోనే బౌలింగ్‌లోనూ సత్తా చాటింది. దాంతో మూడో రోజు ఆట ముగిసే సమయానికి శ్రీలంక 83.4 ఓవర్లలో 8 వికెట్లకు 265 పరుగులు చేసింది. క్రీజులో లాహిరు కుమార(8 బ్యాటింగ్)తో పాటు సోనాల్ దినుషా(85 బ్యాటింగ్) ఉన్నాడు. పసిందు సూర్యబండార(133 బంతుల్లో 9 ఫోర్లతో 80) సెంచరీ చేసే అవకాశాన్ని చేజార్చుకున్నాడు. భారత బౌలర్లలో ప్రసిద్ కృష్ణ(3/47), మానవ్ సుతార్(3/83) మూడేసి వికెట్లు తీయగా.. మహమ్మద్ సిరాజ్, రవీంద్ర జడేజా తలో వికెట్ పడగొట్టారు. అరంగేట్ర స్పిన్నర్ సారాన్ష్ జైన్ ఒక్క వికెట్ తీయలేకపోయాడు. శ్రీలంక ఇంకా 238 పరుగుల వెనుకంజలో ఉంది. నాలుగో రోజు ఆటలో వీలైనంత త్వరగా శ్రీలంకను ఆలౌట్ చేసి భారత్ బ్యాటింగ్‌కు దిగే అవకాశం ఉంది. ఒక సెషన్ పాటు బ్యాటింగ్ చేసి 300 ప్లస్ లక్ష్యాన్ని శ్రీలంక ముందు ఉంచి విజయం కోసం ప్రయత్నించనుంది. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 503/9 స్కోర్ వద్ద డిక్లేర్డ్ చేసిన సంగతి తెలిసిందే. 8/2 ఓవర్‌నైట్ స్కోర్‌తో మూడో రోజు ఆటను కొనసాగించిన శ్రీలంకకు ఆదిలోనే గట్టి షాక్ తగిలింది. కామిల్ మిషారా(19)ను ప్రసిద్ కృష్ణ ఔట్ చేయగా.. కామిందు మెండిస్‌తో కలిసి పసిందు సూర్య బండార ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. ఈ క్రమంలో అతను 76 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. 87 పరుగుల భాగస్వామ్యంతో క్రీజులో పాతుకుపోయిన ఈ జోడీని ప్రసిద్ కృష్ణ విడదీసాడు. కామిందు మెండిస్(32)ను క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. దాంతో శ్రీలంక 130/4 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. ఈ సమయంలో వర్షం అంతరాయం కలిగించడంతో రెండో సెషన్ ఆలస్యంగా ప్రారంభమైంది. సెకండ్ సెషన్ ఆరంభంలోనే ధనంజయ డిసిల్వా(8)ను మానవ్ సుతార్ పెవిలియన్ చేర్చాడు. దాంతో శ్రీలంక 137 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ పరిస్థితుల్లో సోనాల్ దినుషాతో కలిసి పసిందు జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. సెంచరీ దిశగా సాగిన పసిందును జడేజా క్లీన్ బౌల్డ్ చేశాడు. ఆ వెంటనే నిరోషన్ డిక్‌వెల్లా(0)ను సిరాజ్ డకౌట్‌గా పెవిలియన్ చేర్చాడు. కేశర నువాంతతో కలిసి సోనాల్ దినుషా పోరాడాడు. తొలి టెస్ట్ ఫామ్‌ను కొనసాగిస్తూ.. 82 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. దాంతో శ్రీలంక 216/7 స్కోర్‌తో టీ బ్రేక్‌కు వెళ్లింది. ఆఖరి సెషన్‌లోనూ ఈ జోడీ ఆచితూచి ఆడింది. 57 పరుగుల భాగస్వామ్యంతో ప్రమాదకరంగా మారిన ఈ జోడీని మానవ్ సుతార్ విడదీసాడు. ఈ వికెట్‌తో 20 వికెట్ల మైలురాయి అందుకున్నాడు. లాహిరు కుమారా ఆచితూచి ఆడగా.. సోనాల్ దినుషా తనదైన శైలిలో బ్యాటింగ్ చేశాడు. మరో వికెట్ పడకుండా ఈ ఇద్దరూ జాగ్రత్త పడటంతో శ్రీలంక 265/8 స్కోర్ వద్ద మూడో రోజు ఆటను ముగించింది.

# చరిత్ర సృష్టించిన ధ్రువ్ జురెల్..




టీమిండియా యువ వికెట్ కీపర్ కమ్ బ్యాటర్ ధ్రువ్ జురెల్ చరిత్ర సృష్టించాడు. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్(డబ్ల్యూటీసీ) చరిత్రలో విదేశీ గడ్డపై ఏడు అంత కంటే తక్కువ స్థానంలో ఆడి అత్యధిక పరుగులు చేసిన తొలి భారత బ్యాటర్‌గా నిలిచాడు. అంతేకాకుండా శ్రీలంక గడ్డపై ఏడో స్థానంలో వచ్చి సెంచరీ చేసిన తొలి భారత బ్యాటర్‌గా కూడా గుర్తింపు పొందాడు. కొలంబో వేదికగా శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్ట్‌లో ఏడో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన ధ్రువ్ జురెల్ (177 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్స్‌లతో 115 నాటౌట్) అజేయ శతకంతో రాణించిన సంగతి తెలిసిందే. ఈ సెంచరీతో ధ్రువ్ జురెల్ తన పేరిట పలు రికార్డ్‌లను లిఖించుకున్నాడు. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ చరిత్రలోనే విదేశాల్లో జరిగిన టెస్ట్‌ల్లో ఏడు లేదా అంతకంటే తక్కువ స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చి సెంచరీ బాదిన మూడో భారత బ్యాటర్ ధ్రువ్ జురెల్. అతని కంటే ముందు రవీంద్ర జడేజా, నితీష్ కుమార్ రెడ్డి ఈ ఫీట్ సాధించారు. 2024లో ఆస్ట్రేలియా గడ్డపై జరిగిన బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో మెల్‌బోర్న్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో 8వ స్థానంలో బ్యాటింగ్ చేసిన నితీష్ కుమార్ రెడ్డి 114 పరుగులు చేశాడు. 2022లో ఇంగ్లండ్‌తో జరిగిన బర్మింగ్‌హామ్ టెస్ట్‌లో ఏడో స్థానంలో బ్యాటింగ్ చేసిన రవీంద్ర జడేజా 104 పరుగులు చేశాడు. తాజాగా ధ్రువ్ జురెల్ 115 పరుగులతో అజేయంగా నిలిచి ఈ ఇద్దర్ని వెనక్కి నెట్టి ఏడు లేదా అంతకంటే తక్కువ స్థానాల్లో బ్యాటింగ్ చేసి అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా గుర్తింపు పొందాడు. ఓవరాల్‌గా ఈ ఫీట్ సాధించిన 9వ బ్యాటర్‌గా జురెల్ నిలిచాడు. ఈ జాబితాలో రిషభ్ పంత్(159) అగ్రస్థానంలో ఉన్నాడు. శ్రీలంకతో టెస్ట్‌ల్లో సెంచరీ బాదిన నాలుగో భారత వికెట్ కీపర్ కమ్, ఏడో బ్యాటర్‌గా కూడా ధ్రువ్ జురెల్ నిలిచాడు. అతని కంటే ముందు శ్రీలంకపై కపిల్ దేవ్, ధోనీ, రవీంద్ర జడేజా ఈ ఫీట్ సాధించారు. అయితే శ్రీలంక గడ్డపై సెంచరీబాదిన తొలి నెంబర్ 7 భారత బ్యాటర్‌గా ధ్రువ్ జురెల్ గుర్తింపు పొందాడు.




# శ్రీలంక బ్యాటర్‌పై ఐసీసీ చర్యలు..

శ్రీలంక బ్యాటర్ ప్రభాత్ జయసూర్యపై అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్(ఐసీసీ) చర్యలు తీసుకుంది. భారత్‌తో కొలంబో వేదికగా జరుగుతున్న రెండో టెస్ట్‌లో ప్రభాత్ జయసూర్య..ఐసీసీ నియమావళిని ఉల్లంఘించాడనే కారణంతో ఓ డీ మెరిట్ పాయింట్ కేటాయించడంతో పాటు మందలించింది. రెండో రోజు ఆటలో మానవ్ సుతార్ బౌలింగ్‌లో ఔటైన ప్రభాత్ జయసూర్య.. మైదానం వీడే సమయంలో బౌండరీ లైన్‌ను బ్యాట్‌తో కొట్టాడు. ఈ చర్య ఐసీసీ ఆర్టికల్ 2.2 క్రికెట్ పరికరాలు, దుస్తులు, మైదాన సామగ్రిని ధ్వంసం చేయడం కిందికి వస్తుంది. దాంతో అతను ఐసీసీ లెవెల్ 1 రూల్‌ను ఉల్లంఘించినట్లు తేలింది. ప్రభాత్ జయసూర్య తన తప్పిదాన్ని, విధించిన శిక్షను అంగీకరించాడు. దాంతో ఈ వ్యవహారానికి సంబంధించి తదుపరి విచారణ అవసరం లేదని ఐసీసీ తమ ప్రకటనలో పేర్కొంది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ తొలి ఇన్నింగ్స్‌ను 503/9 భారీ స్కోర్ వద్ద డిక్లేర్డ్ చేసింది. ధ్రువ్ జురెల్(177 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్స్‌లతో 115 నాటౌట్), దేవదత్ పడిక్కల్(193 బంతుల్లో 12 ఫోర్లతో 117) సెంచరీలతో రాణించగా.. రిషభ్ పంత్(89 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లతో 63), శుభ్‌మన్ గిల్(108 బంతుల్లో 6 ఫోర్లతో 50) హాఫ్ సెంచరీలతో సత్తా చాటారు. శ్రీలంక బౌలర్లలో అసితా ఫెర్నాండో(4/106) నాలుగు వికెట్లు తీయగా..ప్రభాత్ జయసూర్య, కేశర నువాంత్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. లాహిరు కుమారాకు ఒక వికెట్ దక్కింది.అనంతరం శ్రీలంక మూడో రోజు ఆట ముగిసే సమయానికి 83.4 ఓవర్లలో 8 వికెట్లకు 265 పరుగులు చేసింది. క్రీజులో లాహిరు కుమార(8 బ్యాటింగ్)తో పాటు సోనాల్ దినుషా(85 బ్యాటింగ్) ఉన్నాడు. పసిందు సూర్యబండార(133 బంతుల్లో 9 ఫోర్లతో 80) సెంచరీ చేసే అవకాశాన్ని చేజార్చుకున్నాడు. భారత బౌలర్లలో ప్రసిద్ కృష్ణ(3/47), మానవ్ సుతార్(3/83) మూడేసి వికెట్లు తీయగా.. మహమ్మద్ సిరాజ్, రవీంద్ర జడేజా తలో వికెట్ పడగొట్టారు. అరంగేట్ర స్పిన్నర్ సారాన్ష్ జైన్ ఒక్క వికెట్ తీయలేకపోయాడు. శ్రీలంక ఇంకా 238 పరుగుల వెనుకంజలో ఉంది.




# సెమీఫైనల్ రేసు నుంచి వైదొలిగిన భారత్


## • అర్జెంటీనా చేతిలో 3-5 గోల్స్ తేడాతో ఓటమి




పురుషుల హాకీ వరల్డ్ కప్ 2026 టోర్నమెంట్‌లో భారత జట్టుకు పరాభవం కలిగింది.. సోమవారం అర్జెంటీనాతో జరిగిన కీలకమైన పూల్ ఈ మ్యాచ్‌లో భారత్ 3–5 గోల్స్ తేడాతో ఘోర ఓటమి ఎదుర్కొంది. సెమీఫైనల్ చేరాలంటే కనీసం మూడు గోల్స్ తేడాతో గెలవాల్సిన తప్పనిసరి పరిస్థితిలో బరిలోకి దిగిన భారత జట్టు, ఆరంభం నుంచే తీవ్ర ఒత్తిడిలో కూరుకుపోయింది. ఈ ఓటమితో పూల్ ఈ లో ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ ఒక్క పాయింట్ కూడా సాధించలేకపోయిన ఇండియా సెమీస్ ఆశలు ఆవిరయ్యాయి. పూల్ ఈ నుంచి నెదర్లాండ్స్ ఇప్పటికే సెమీఫైనల్ బెర్తును దక్కించుకుంది. మ్యాచ్ మొదలైన మొదటి నిమిషంలోనే అర్జెంటీనా ఆటగాడు జోక్విన్ తోస్కాని అద్భుతమైన ఫీల్డ్ గోల్ చేసి భారత గోల్ కీపర్ మోహిత్ ను బురిడి కొట్టించాడు. ఆ తర్వాత ఆరో నిమిషంలో నికోలస్ డెల్లా టోర్రే పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలచి అర్జెంటీనా ఆధిక్యాన్ని 2–0 తో రెట్టింపు చేశాడు. 10వ నిమిషంలో అభిషేక్ అందించిన పాస్‌తో సుఖ్‌జీత్ సింగ్ గోల్ కొట్టి భారత్‌ను రేసులోకి తెచ్చేందుకు ప్రయత్నించాడు. అయితే పాసింగ్ లోపాలు, బంతి నియంత్రణ కోల్పోవడం వల్ల భారత దాడులు వరుసగా నిరాశ పర్చాయి. రెండో క్వార్టర్‌లో ఎలాంటి గోల్స్ నమోదు కాకపోవడంతో హాఫ్ టైమ్ సమయానికి భారత్ 1–2 తో వెనుకంజలో నిలిచింది. మూడో క్వార్టర్ ప్రారంభమైన వెంటనే అర్జెంటీనా మరింత దూకుడు కనబర్చింది. 33వ నిమిషంలో టోమస్ డొమెనె రివర్స్ హిట్‌తో గోల్ చేసి ఆధిక్యాన్ని 3–1 కి పెంచాడు.

ఆ తర్వాత భారత డిఫెన్స్ చేసిన తప్పిదాన్ని సొమ్ము చేసుకుంటూ డొమెనె పెనాల్టీ స్ట్రోక్‌ను గోల్‌గా మార్చి స్కోరును 4–1 గా తిరుగులేని విధంగా మలిచాడు. దీంతో టోర్నమెంట్‌లో అతడి గోల్స్ సంఖ్య ఏడుకు చేరి, హర్మన్‌ప్రీత్ సింగ్ (6 గోల్స్) ను దాటాడు. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ డ్రాగ్ ఫ్లిక్స్‌ను అర్జెంటీనా డిఫెండర్లు సమర్థవంతంగా అడ్డుకోవడంతో భారత్‌కు దక్కిన పెనాల్టీ కార్నర్లు వృథాగా మారాయి. 53వ నిమిషంలో లూకాస్ తోస్కాని అర్జెంటీనా తరఫున ఐదో గోల్ నమోదు చేశాడు. మ్యాచ్ చివరి నిమిషాల్లో 58వ నిమిషంలో సుఖ్‌జీత్ సింగ్ తన రెండో గోల్ నమోదు చేయగా, 59వ నిమిషంలో హార్దిక్ సింగ్ పెనాల్టీ స్ట్రోక్‌ను గోల్‌గా చేశాడు. అయినప్పటికీ భారత్ 3–5 తో ఓటమి పాలైంది.భారత్ ఏడు లేదా ఎనిమిదో స్థానం కోసం జరిగే క్లాసిఫికేషన్ మ్యాచ్‌లలో ఆడాల్సి ఉంటుంది.

# మేధావి బిధూరి సిక్స్ సెవెన్ సెలబ్రేషన్ వైరల్



విమెన్స్ ఢిల్లీ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూడీపీఎల్) 2026 సీజన్ ఓపెనింగ్ మ్యాచ్ లో యువ లెగ్ స్పిన్నర్ మేధావి బిధూరి చేసిన వినూత్న వికెట్ సంబరం ఇంటర్నెట్ లో సెన్సేషన్ గా మారి పోయింది. సెంట్రల్ ఢిల్లీ క్వీన్స్ తరఫున ఆడుతున్న బిధూరి, సౌత్ ఢిల్లీ సూపర్‌స్టార్జ్ బ్యాటర్ నిషికా సింగ్ ను 16వ ఓవర్లో అవుట్ చేసిన తర్వాత చేసిన “6–7” సెలబ్రేషన్ అభిమానులను విపరీతంగా అలరించింది. ఆరుషి గోయల్ మిడ్ వికెట్ లో క్యాచ్ పట్టగానే బిధూరి వేళ్లతో చేసిన ఈ జెస్చర్ వీడియో సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో విపరీతంగా షేర్ అవుతోందని తెలుస్తోంది. మ్యాచ్ ముగిసిన తర్వాత మేధావి బిధూరి మాట్లాడుతూ ఈ సెలబ్రేషన్ వెనుక ఉన్న అసలు కారణాన్ని వివరించింది. మొదట ఆమె 12వ నంబర్ జెర్సీని తీసుకోవాలని అనుకున్నప్పటికీ, ఆ నంబర్ అప్పటికే వేరే ప్లేయర్‌కు కేటాయించడంతో ఆమె 67వ నంబర్ జెర్సీని సెలెక్టు చేసుకుంది. “ప్రస్తుతం ఈ సిక్స్–సెవెన్ ట్రెండ్ నడుస్తోంది. నా చెల్లెలు నన్ను 67వ నంబర్ జెర్సీ ధరించమని, వికెట్ పడినప్పుడు ఇలాగే సెలబ్రేట్ చేసుకోమని సూచించింది” అని మేధావి పేర్కొంది. ఢిల్లీ డొమెస్టిక్ క్రికెట్ సెటప్‌లో మేధావి బిధూరి చాలా కాలంగా స్థిరమైన ప్రదర్శన నమోదు చేస్తోంది. అండర్–19 స్థాయిలో ఢిల్లీకి ప్రాతినిధ్యం వహించిన ఈ రైట్ ఆర్మ్ లెగ్ స్పిన్నర్, గత 2025 సీజన్ ఫైనల్లో సౌత్ ఢిల్లీ సూపర్‌స్టార్జ్ తరఫున ఆడి 3/26 గణాంకాలతో జట్టును ఒక్క పరుగు తేడాతో ఛాంపియన్‌గా నిలపడంలో అద్భుత ప్రదర్శన కనబర్చింది. విమెన్స్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) 2024 వేలంలోనూ ఆమె పేరు నమోదు కావడం విశేషం. మేధావి బిధూరి సెలబ్రేషన్ క్రేజ్ ఎంతలా పెరిగిందంటే భారత వెటరన్ లెగ్ స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ కూడా దీన్ని కాపీ చేసి, సరదా తీర్చుకున్నాడు. ఇంగ్లాండ్‌లో జరుగుతున్న కౌంటీ ఛాంపియన్‌షిప్ మ్యాచ్‌లో నార్తాంప్టన్‌షైర్ తరఫున ఆడుతూ లాంక్షైర్ బ్యాటర్ జో మూర్స్ ను అవుట్ చేసిన తర్వాత చాహల్ ఇదే “6–7ష గెస్చర్‌తో దుమ్మురేపాడు. ఓల్డ్ ట్రాఫోర్డ్ మైదానంలో చాహల్ చేసిన ఈ పనితో భారత మహిళా క్రికెటర్ స్టైల్ అంతర్జాతీయ స్థాయిలో మరింతగా పాపులర్ అయిందనడంలో సందేహం లేదు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# దేశ విభజన నేపథ్యంలో బట్వారా 1947




### పేలవ ప్రదర్శనతో ఆకట్టులోకపోయిన చిత్రం

సన్నీ డియోల్ హీరోగా దేశ విభజన గాథ నేపథ్యంలో ఆమిర్ ఖాన్ నిర్మించిన 'బట్వారా 1947' చిత్రం ఆగస్ట్ 14న విడుదలైంది. ఈ సినిమా బాక్సాఫీస్ బరిలో చాలా పేలవమైన ప్రభావాన్ని చూపించింది. దీనికి ముందు ఇదే తరహాలో వచ్చిన 'మై వాపస్ ఆవుంగా' దీనికంటే బెటర్ గా పెర్ఫార్మ్ చేసిందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. 'బట్వారా' చిత్రంతో ఆమిర్ ఖాన్‌కు దాదాపు 90 కోట్ల నష్టం వచ్చిందని అంచనా వేస్తున్నారు. అయితే ఇప్పుడీ సినిమా ఓటీటీ డీల్ సందిగ్ధంలో పడింది. నిజానికి సినిమా రిలీజ్ కు ముందు ఓ ప్రముఖ ఓటీటీ సంస్థ రూ. 125 కోట్లను ఆఫర్ చేసిందట. కానీ అప్పుడు అందుకు ఆమిర్ ఖాన్ అంగీకరించలేదని తెలిసింది. ఇప్పుడు సినిమా విడుదలై పరాజయం పాలు కావడంతో ఏ ఓటీటీ ప్లాట్ ఫామ్ కూడా దీని హక్కులపై ఆసక్తి చూపడం లేదట. 'బట్వారా' సినిమా విడుదలకు ముందే ఓటీటీ డీల్ కుదర్చుకోమని, ఆ కారణంగా ఆర్థికంగా ఉపయోగపడుతుందని ఆమిర్‌కు సన్నీడియోల్ చెప్పినట్టు వార్తలు వచ్చాయి. అయితే ఆయన దానిని ఖండించారు. తమ మధ్య ఓటీటీ డీల్‌కు సంబంధించి ఎలాంటి చర్చ జరగలేదని ఆయన అన్నారు. 'బట్వారా' సినిమా విషయంలో తాను గర్వం పడుతుంటానని, బాక్సాఫీస్ ఫలితాలు సినిమా క్వాలిటీని ప్రతిఫలించవని ఆయన తెలిపారు. తన తండ్రి కెరీర్ లో హృషికేశ్ ముఖర్జీ తీసిన 'సత్యకామ్' ఉత్తమ చిత్రంగా తాను భావిస్తానని, కాని ఆ సినిమా బాక్సాఫీస్ దగ్గర భారీ పరాజయాన్ని చవిచూసిందని సన్నీ డియోల్ చెప్పారు. అయితే 'బట్వారా' నష్టాలు రాబోయే రోజుల్లో భర్తీ అవుతాయనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.

Cinema Madness




## తెలుగులో విడుదలవుతున్న 'బెత్లెహెమ్ కుటుంబ యూనిట్'

మలయాళ సినీ పరిశ్రమలో సంచలన విజయాలను నమోదు చేస్తూ బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతున్న సరికొత్త ఫీల్-గుడ్ లవ్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'బెత్లెహెమ్ కుడుంబ యూనిట్' ఇప్పుడు తెలుగు ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమైంది. 'బెత్లెహెమ్ కుటుంబ యూనిట్' అనే పేరుతో రాబోతున్న ఈ సినిమాను టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఘనంగా విడుదల చేయబోతుంది.యువ కథానాయకుడు నివిన్ పౌలి హీరోగా, సెన్సేషనల్ నటి మమితా బైజు నాయికగా నటించిన ఈ చిత్రానికి గిరీష్ ఎ.డి. దర్శకత్వం వహించారు. కేరళలో ఓణం కానుకగా విడుదలైన ఈ సినిమా అంచనాలకు మించి భారీ వసూళ్లను రాబట్టడమే కాకుండా, ప్రేక్షకుల నుంచి ప్రశంసల వర్షాన్ని అందుకుంది. ముఖ్యంగా నివిన్ పౌలి నటన మరియు మమితా బైజుతో ఆయన ఆన్-స్క్రీన్ కెమిస్ట్రీ ప్రేక్షకులను ఎంతగానో కట్టుపడేసింది. ఇక 'ప్రేమలు' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు అత్యంత దగ్గరైన మమితా బైజు నటిస్తున్న మరో చిత్రం కావడంతో టాలీవుడ్‌లోనూ ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. భావనా స్టూడియోస్ నిర్మాణంలో తెరకెక్కిన ఈ చిత్రాన్ని ఫ్యూచర్ రన్-అప్ సహకారంతో మైత్రీ రిలీజ్ సంస్థ తెలుగు ప్రేక్షకులకు అందిస్తోంది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం సెప్టెంబర్ 4న థియేటర్లలో విడుదల కానుంది. మలయాళంలో తిరుగులేని విజయం సాధించిన ఈ చిత్రం తెలుగు ప్రేక్షకులను కూడా కచ్చితంగా అలరిస్తుందని చిత్రయూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది.

## ఇరుముడికి ఫ్యామిలీ ఆడియెన్స్ బ్రహ్మరథం

### - కలెక్షన్లలో వందకోట్ల క్లబ్బుకు చేరిన మూవీ

మాస్ మహారాజా రవితేజ హీరోగా, దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కించిన తాజా చిత్రం 'ఇరుముడి' బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతోంది. విడుదలైన తొలి రోజు నుంచే పాజిటివ్ టాక్‌తో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న ఈ సినిమా కలెక్షన్ల పరంగా సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రం కేవలం నాలుగు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.100 కోట్ల గ్రాస్ మార్క్‌ను అందుకుంది. రవితేజ కెరీర్‌లో అత్యంత వేగంగా రూ.100 కోట్ల గ్రాస్ క్లబ్‌లో చేరిన చిత్రంగా 'ఇరుముడి' నిలిచింది. చాలా కాలంగా ఒక భారీ కమర్షియల్ హిట్ కోసం ఎదురుచూస్తున్న రవితేజకు ఈ చిత్రం కెరీర్‌లోనే ప్రత్యేకమైన విజయాన్ని అందించిందని అభిమానులు సంబరాలు చేసుకుంటున్నారు.సాధారణంగా వీకెండ్ ముగిసిన తర్వాత వచ్చే మొదటి సోమవారం చాలా సినిమాల బుకింగ్స్, ఆక్యుపెన్సీలు తగ్గడం సహజం. కానీ 'ఇరుముడి' విషయంలో మాత్రం పరిస్థితి భిన్నంగా కనిపించింది. విడుదలైన నాలుగో రోజు కూడా సినిమా బుకింగ్స్ బలంగా కొనసాగడంతో ట్రేడ్ వర్గాలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నాయి. మొదటి రోజు స్థాయికి దగ్గరగా బుకింగ్స్ నమోదవడం 'ఇరుముడి'పై ప్రేక్షకుల్లో ఉన్న క్రేజ్‌ను తెలియజేస్తోంది. రీజినల్ సినిమాల్లో ఫస్ట్ మండే బుకింగ్స్ పరంగా కూడా ఈ చిత్రం కొత్త రికార్డులు నమోదు చేసినట్లు తెలుస్తోంది. 'ఇరుముడి' హవా టికెట్ సేల్స్‌లోనూ స్పష్టంగా కనిపిస్తోంది.



### ఏకి పడేసిన నటి, ఎంపి కంగనా రనౌత్

కృతి సనన్ ఇటీవల నటించిన ఓ యాడ్ ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. దీనిపై ఇప్పటికే నెట్టింట విమర్శలు రాగా.. బాలీవుడ్ నటి, ఎంపీ కంగనా రనౌత్ తాజాగా మండిపడ్డారు. రక్షా బంధన్ అంటే ప్రతి సోదరికీ ఎంతో ప్రత్యేకమైన రోజు. అంత గొప్ప సమయంలో హుందాగా కనిపించాలి. ఈ సాంప్రదాయ పండగకు సంబంధించిన ప్రకటనలో ఇలాంటి దుస్తులా ధరించేది. ఈ రోజుల్లో మహిళలకు లెహంగాలు, జీన్స్, సల్వార్ కమీజ్, చీరలు, పంజాబీ డ్రెస్‌లు.. ఇన్ని రకాలు ఉన్నాయి. ఇన్ని ఉన్నా.. ఇలాంటి బికినీ ధరించి రాఖీ ఎందుకు కడతారు?. ఈ యాడ్ చేసిన స్టైలిష్ట్‌కు ఈ ఆప్షన్లు కనిపించలేదా? ఈ యాడ్ ఉద్దేశపూర్వకంగా చేసినట్లుంది. చాలా అసహ్యంగా కనిపిస్తోందని తన ఇన్‌స్టాలో రాసుకొచ్చారు. ఇటీవల విడుదలైన ఈ యాడ్‌పై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. సోషల్ మీడియా వేదికగా కృతిని ట్రోల్ చేస్తున్నారు. డ్రెస్‌తో పాటు.. ఈ యాడ్‌లో పెంపుడు కుక్కకు రాఖీ కడుతూ కృతి కనిపించడంతో విమర్శలు మరింత ఎక్కువయ్యాయి. ఈ యాడ్‌పై ఇప్పటి వరకూ యాజమాన్యం, కృతి సనన్ స్పందించలేదు.


## బికినీలో కృతిసనన్ రక్షాబంధన్ సెలబ్రేషన్స్



## నటనను నీ నుంచి నేర్చుకోవాల్సిందే

### - బేబీ నక్షత్రకు నటుడు ధనుష్ ప్రశంసలు


'ఇరుముడి' చిత్రం ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ అందుకుంటోంది. ముఖ్యంగా సినిమాలోని కథ, భావోద్వేగ సన్నివేశాలు, నటీనటుల ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ఈ సినిమాలో రవితేజ నటనతో పాటు ఆయన కుమార్తె పాత్రలో నటించిన బాలనటి బేబీ నక్షత్ర నటనకు విశేష ప్రశంసలు దక్కుతున్నాయి. తండ్రి-కూతుళ్ల మధ్య ఉండే అనుబంధాన్ని తెరపై ఎంతో భావోద్వేగంగా చూపించడంలో ఈ ఇద్దరి నటన కీలక పాత్ర పోషించిందని ప్రేక్షకులు అభిప్రాయపడుతున్నారు. 'ఇరుముడి' సక్సెస్ మీట్ తర్వాత దర్శకుడు శివ నిర్వాణ బేబీ నక్షత్రకు ఒక ప్రత్యేకమైన సర్‌ప్రైజ్ ఇచ్చారు. జాతీయ అవార్డు గ్రహీత, ప్రముఖ నటుడు ధనుష్‌తో నక్షత్రకు వీడియో కాల్ ఏర్పాటు చేశారు. సినిమాలో ఆమె నటనను చూసిన ధనుష్ చిన్నారిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ వీడియో కాల్‌లో ధనుష్ మాట్లాడిన మాటలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. నక్షత్ర నటనను ప్రశంసిస్తూ, ఎప్పుడైనా ఇద్దరం కలిసినప్పుడు 'నేను నీ దగ్గర నటన నేర్చుకోవాలి' అంటూ సరదాగా చెప్పారు.. ఒక స్టార్ హీరో, జాతీయ అవార్డు విజేత నుంచి ఇలాంటి ప్రశంసలు రావడంతో నక్షత్ర ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.ధనుష్‌తో జరిగిన ఈ ప్రత్యేక సంభాషణను బేబీ నక్షత్ర తన ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నారు. దీంతో ఈ వీడియో నెటిజన్ల దృష్టిని ఆకర్షించి వైరల్‌గా మారింది.



## నేడు విడుదలవుతున్న టాక్సిక్

### - టిక్కెట్ రేట్ల పెంపునకు తెలంగాణలో అనుమతి

కన్నడ రాకింగ్ స్టార్ యశ్ హీరోగా నటిస్తున్న పాన్ ఇండియా మూవీ 'టాక్సిక్' ఆగస్టు 26 ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న తరుణంలో, తెలంగాణ ప్రభుత్వం సినిమా టికెట్ ధరలను పెంచుకునేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు హోమ్ శాఖ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వం జారీ చేసిన జీవో ప్రకారం.. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సింగిల్ స్క్రీన్ థియేటర్లలో జీఎస్టీతో కలుపుకుని రూ. 50, అలాగే మల్టీప్లెక్స్‌లు మరియు స్పెషల్ థియేటర్లలో రూ. 100 వరకు అదనంగా టికెట్ ధరలను పెంచుకోవడానికి అనుమతిని ఇచ్చారు. పెంచిన ధరలు సినిమా విడుదలైన రోజు నుంచి సెప్టెంబర్ 4 వరకు పది రోజుల పాటు అమలులో ఉంటాయి. అలాగే ఈ పది రోజుల పాటు రోజుకు అదనంగా ఒక షోతో కలుపుకుని మొత్తం 5 షోలు ప్రదర్శించుకోవడానికి ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. ధరల పెంపుతో పాటు మరికొన్ని కీలక నిబంధనలను కూడా ఖరారు చేసింది. సినీ కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని, తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అకౌంట్‌కు నిర్మాణ సంస్థ 'కేవీఎన్-మాన్స్టర్ మైండ్ క్రియేషన్స్ ఎల్ఎల్‌పీ' తక్షణమే రూ. 1 కోటి విరాళంగా అందించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నిధులను పూర్తిగా సినీ కార్మికుల సంక్షేమం కోసం మాత్రమే ఖర్చు చేయనున్నారు. అలాగే, సినిమా ప్రదర్శన సమయంలో మాదకద్రవ్యాలు, నార్కోటిక్స్ మరియు సైబర్ క్రైమ్ వల్ల కలిగే దుష్ప్రభావాలపై ప్రజలకు, ముఖ్యంగా యువతకు అవగాహన కల్పించే ప్రత్యేక ప్రకటనలను తప్పనిసరిగా ప్రదర్శించాలని థియేటర్ల యాజమాన్యాలను ప్రభుత్వం ఆదేశించింది.




Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613